بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

إِنَّكَ لَعَلٰى خُلُقٍ عَظِيْمٍ

# ఇస్లాం ప్రియ బోధనలు




రచయిత :

సయ్యద్ అబ్దుల్ హకీం, ఎం.ఎ.

అనువాదం :

అబ్దుల్ బాసిత్ ఉమరి, ఎం.ఓ.ఎల్.



ప్రచురణ కర్త :

బహదుర్ ابو ساجده (بہادر)

## బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

# ముందుమాట

అల్‌హమ్‌దు లిల్లాహి రబ్బిల్‌ఆలమీన్ వస్సలాతు వస్సాలామ్ అలా రసూలిహిల్ కరీమ్. అమ్మా బాద్...

సర్వ స్తోత్రములు అల్లాహ్‌సుబ్‌హన హుతాలాకే చెందును. ప్రియ ప్రవక్త ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్ వారిపై అల్లాహ్ యొక్క సుభాలు కురియుగాక!

నేడు ఆర్థిక, సామాజిక, భౌతిక, వైజ్ఞానికపరంగా దినదినాభివృద్ధి చెందుతున్న ఈ తరుణంలో మానవుడు నైతికంగా దిగజారుతున్నాడు. దీనికి కారణంగా అన్యాయాలు, అక్రమాలు, హింసాకాండలు, పెచ్చరిల్లి పోతున్నాయి. వీటన్నిటిని రూపుమాపుటకై కేవలం ఇస్లాం మాత్రమే పరిష్కార మార్గము వైపునకు ఆహ్వానిస్తున్నది.

ఏకదైవోపాసన మరియు ప్రతీ దేశంలో, ప్రతీ ప్రాంతమందు ఆచరణ యోగ్యమైన దైవ ధర్మం, నీతి నిజాయితీ సదాచరణ, ప్రేమాను రాగాలు, కృతజ్ఞతాభావం, సర్వ మానవాళి సమానత్వం, వైజ్ఞానిక, సాంఘీక, నిస్వార్థత, ఆర్థిక పరిష్కారాలు మొదలగునవి పరిపూర్ణ చట్టాలు కేవలం ఇస్లాంలో మాత్రమే ఇమిడి ఉన్నాయని చెప్పవచ్చు.

వీటిని అమలుపరిచే విధానాలు, అంతిమ మార్గదర్శకులైన ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్ తన జీవనశైలిలో క్రియాత్మకంగా అమలు పరచి చూపించారు.

ఇవన్ని ఇహ సాఫల్యం కొరకు, మరణాంతర జీవితం ఉందని ధృడ విశ్వాసంతో ఆచరించువారికి స్వర్గము లభిస్తుందని తిరస్కరించేవారికి నరకమని ఇస్లాం మౌళిక విశ్వాసం.

పై విషయములను జనామ్ మౌలానా సయ్యద్ అబ్దుల్ హకీంగారు ముస్లింల సంస్కరణ మరియు ముస్లిమేతరులకు ఇస్లాం ధర్మ ఆహ్వానం మొదలగు ఉన్నత సంకల్పాలతో ఈ పుస్తకాన్ని రచించి ధన్యులయ్యారు. ఇందు అన్ని విషయాలు దివ్య ఖుర్ఆన్ మరియు హదీసు వచనాల ఆధారంతోనే పేర్కొనబడినవి. ఈ క్రింది అతి క్లుప్తంగా రచయిత జీవిత విశేషాలు ఇవ్వబడుతున్నాయి.

సయ్యద్ అబ్దుల్ హకీంగారు తేది 07-09-1939న హైదరాబాద్ లో జన్మించారు. ఆయన 1969లో ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి ఎం.ఎ. చేశారు. మరొకవైపు ఇస్లాం ధార్మిక విద్యలో కూడా ప్రావీణ్యత సంపాదించారు. ఆయన గొప్ప ప్రసంగీకులేకాక ప్రముఖ రచయిత కూడా. ఇంతవరకు సుమారు ఇరవైకు పైగా పుస్తకాలు రచించారు. అవి ఉర్దూ భాషలోనే కాక ఆంగ్ల మరియు తెలుగు భాషల్లో కూడా అనువదింపబడి ప్రచురింపబడినవి. మౌలానా సయ్యద్‌గారు ప్రస్తుతం సౌదీ అరేబియా ప్రభుత్వం తరుపున దొహఖతర్‌లో ఇస్లాం ప్రచార బోధనా కేంద్రంలో ధార్మిక బోధకునిగా సేవ చేయుచున్నారు.

అల్లాహ్ రచయితకు, అనువాదకునికీ, ప్రచురణకర్తకు మరియు ఇతర సహకారులందరికీ సంకల్ప శుద్ధి ప్రసాదించుగాక. ఈ పుస్తకాన్ని ప్రజల కోరికపై తదుపరి ముద్రణలకు అనుమతిపొంది, నేను అబుసాజిదా (బహదుర్) విశాఖపట్నం నుండి ముద్రించుట ప్రారంభించితిని. ఇప్పటి వరకు ఐదువేల పుస్తకమలు ముద్రింపబడినవి. ఈ పుస్తకాన్ని అతి తక్కువ ధరకు ముద్రించి సామాన్యుడి చేరువలో అందించుటకు ప్రయత్నించు చున్నాను. అల్లాహ్ మా సంకల్పాన్ని స్వీకరించి, మరిన్ని ధార్మిక పుస్తకములను ప్రచురించి ప్రజలకు అందజేసే శక్తి సామర్థ్యాలు ప్రసాదించు గాక! ఆమీన్

**రబ్బనా తఖబ్బల్ మిన్నా ఇన్నక అంతా సమివుల్ అలీమ్**

ఇట్లు

**బహదుర్**

**ఇ.నెం. 24-63-2సి, అబుసరంగ్ మన్‌జిల్ (కోటవీధి)**

**ఫెర్రిరోడ్, విశాఖపట్నం-1. సెల్ నెం. 9848067793**

# బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

**పవిత్ర వచన పరిచయం :** లాఇలాహ ఇల్లల్లాహ ముహమ్మదుర్రసూలుల్లాహ్. అనగా అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడెవరూ లేరు. ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్ అల్లాహ్ యొక్క ప్రవక్త.

ఈ రెండు వాక్యాలను కలిపి పవిత్ర వచనం అంటారు. ఈ వచనాన్ని పఠించి, దాని అర్దం తెలుసుకొని, దానిని అంగీకరించి, దానియందు విశ్వాసం ఉంచి, దాని ప్రకారం ఆచరిస్తానని వాగ్దానం చేసిన తర్వాతనే ఎవరైనాసరే ముస్లిం అవుతాడు. దాని అర్థం అల్లాహ్ ఒక్కడే నిజమైన దైవం. ఆయన తప్ప వేరే ఎవరికి దైవం అనబడే అర్హతలేదు. అల్లాహ్ తప్ప మరి ఎవరిని పూజించరాదు.

దాని రెండవ భాగం యొక్క అర్ధం ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్ అల్లాహ్ యొక్క చిట్టచివరి సత్య ప్రవక్త. ఇందు ఎటువంటి సందేహము లేదు. ఆయన యందు విశ్వాసం ఉంచి ఆయనను అనుసరించటం ద్వారానే మానవ జాతికి మోక్షం లభించును.

పైన పేర్కొనబడిన పవిత్ర వచనమునందు విశ్వాసం ఉంచుటకై ఏడు నిబంధనలు కలవు. అవి 1) జ్ఞానం 2) సంపూర్ణ నమ్మకం 3) చిత్తశుద్ధి 4) సత్య సంధత 5) స్వీకారం 6) విధేయత 7) ప్రేమ.

1. **జ్ఞానం :** పవిత్ర వచనాన్ని పఠించి ప్రతీ వ్యక్తి ఆ వచనం యొక్క అర్థాన్ని తప్పక తెలుసుకోవాలి. అనగా అల్లాహ్ తప్ప వేరే ఎవరూ ఆరాధనకర్హులు కాజాలరని, అల్లాహ్ ఒక్కడే సత్య దైవమని మరియు ముహమ్మద్ (స) అల్లాహ్ యొక్క సత్యప్రవక్తయని తెలుసుకోవాలి.
2. **సంపూర్ణ నమ్మకం:** అల్లాహ్ ఒక్కడే దైవమని యదార్థాన్ని సంపూర్ణంగా నమ్మాలి. దాని గురించి ఎటువంటి సందేహమూ ఉండ కూడదు.
3. **చిత్తశుద్ధి :** పవిత్ర వచనం ప్రకారం ఆచరిస్తూ ఒక అల్లాహ్‌నే చిత్తశుద్ధితో ఆరాధించాలి. బహుదైవారధనకు రవ్వంతైనా అవకాశమివ్వరాదు. మనందరి ఆరాధనలు స్వచ్ఛంగ అల్లాహ్ కొరకే అంకితం కావాలి.

4. **సత్య సంధత :** పవిత్ర వచనం అది సత్య వచనమని స్వచ్ఛమైన మనసుతో విశ్వసిస్తూ కపట మనస్తత్వానికి అతిదూరంగా ఉండాలి.

5. **స్వీకారం :** పవిత్ర వచనాన్ని నిస్సంకోచంగా స్వీకరించి అంగీకరించాలి.

6. **విధేయత :** పవిత్ర వచనాన్ని అంగీకరించిన తర్వాత అల్లాహ్ ఆదేశాలకు పూర్తిగా విధేయులు కావాలి. అనగా అల్లాహ్ ఆదేశాల ప్రకారం ఆచరిస్తూ, ఆయన నిషేదించిన వాటికి అతి దూరంగా ఉండాలి. ఇస్లాం యదార్థం యేమిటంటే మానవుడు తన తనువూ మనస్సు ద్వారా అల్లాహ్‌ను సంతుష్టపర్చాలి దైవ ప్రసన్నత కార్యములు మాత్రమే చేయాలి.

7. **ప్రేమ :** పవిత్ర వచనం యందు విశ్వాసం ఉంచటమేకాక దాని పట్ల ప్రేమ కూడా కలిగి ఉండాలి. ఎందుకంటే అల్లాహ్‌ను ప్రేమించు వాడు అల్లాహ్ ధర్మమైన ఇస్లాంను తప్పక ప్రేమిస్తాడు. అల్లాహ్ పట్ల ప్రేమ లేనివాడు అల్లాహ్ ధర్మాన్ని కూడా ప్రేమింపజాలడు.

విధ్యాభ్యాస ప్రాముఖ్యత : దివ్య ఖుర్ఆన్‌లో మొట్టమొదటి అవతరింపబడిన వాక్యం ఇఖ్‌రాబిస్మిరబ్బికల్లజి ఖలఖ్... (96:1) అర్థం: పఠించు సర్వాన్ని సృష్టించిన నీ ప్రభువు (అల్లాహ్) పేరుతో విద్య నభ్య సించమని ఆదేశింపబడింది. మన శ్రవణ, దృశ్య, ఆలోచనా శక్తులు వాటిని వినియోగించుకొని ప్రయోజనం పొందటానికే మనకు ప్రసాదింప బడినది. అల్లాహ్ యొక్క దైవత్వాన్ని తెలుసుకోవాలనే సంకల్పంతోనే ప్రతి వ్యక్తి విధ్యాభ్యాసం చేయాలి. అల్లాహ్ యొక్క అద్వితీయత, ఆయన ఉత్తమ గుణ విశేషణాలు మరియు కార్యాల గురించి తెలుసుకోవాలి. వాటికి అనుగుణంగా జీవనం మలచుకుంటే అతని జ్ఞానానికి మరియు జీవితానికి సార్ధకత ప్రాప్తమవుతుంది.

మరొక ముఖ్య విషయమేమిటంటే అల్లాహ్‌కు ఇష్టమైన విషయాలు యేమిటో, ఆయనకు అయిష్టమైన విషయాలు ఏమిటో తెలుసుకొని, ఆయనకు ఇష్టమైన విషయాలను స్వీకరించి, ఆయనకు అయిష్టమైన వాటికి అతి

దూరంగా ఉండాలి. ఆయనకు ఇష్టమైన విషయాలు ఉదా : దైవధర్మంపై విశ్వాసం, ఏక దైవారాధన, దైవ ప్రవక్త అనుసరణ. సత్యసందత, ధార్మిక స్థిరత్వం మొదలగునవి. ఆయనకు నచ్చని విషయాలు ఉదా : బహుదైవారాధన, ధర్మ తిరస్కారం, కపట మనస్తత్వం, ధర్మభ్రష్టత, కల్పిత దురాచారాలు (బిద్అత్) దుష్కార్యాలు.

ఇక జ్ఞానం గురించి తెలుసుకుందాం. జ్ఞానం రెండు రకాలు. 1) సత్యజ్ఞానం (ఉపయోగకర జ్ఞానం) 2) దుష్టజ్ఞానం (నిరుపయోగకర వినాశకర జ్ఞానం)

సత్య జ్ఞానం వల్ల ఏక దైవరాధన, దైవ ప్రవక్త అనుసరణ, ధర్మ విశ్వాసం, సత్యసంధత, ధార్మిక స్థిరత్వం సదాచారాలు సత్కార్యాలు మొదలగు సత్ఫలితాలు లభిస్తాయి.

దుష్ట జ్ఞానం వల్ల బహుదైవారాధన, దైవ తిరస్కారం, కపట మనస్తత్వం, ధర్మభ్రష్టత, కల్పిత దురాచారాలు (బిద్అత్) దుష్కార్యాలు పాపకార్యాలు మొదలగు దుష్ఫలితాలు లభిస్తాయి.

సత్యజ్ఞానం పొందినవ్యక్తి సన్మార్గచారియై సత్కార్యాలు చేస్తే అల్లాహ్‌ను సంతుష్టపరుస్తూ, అల్లాహ్‌కు నచ్చని, వాటికి అతిదూరంగా ఉంటాడు. సర్వ విద్యలు మరియు జ్ఞానములకు అసలు పునాది దైవభక్తి, దైవ ప్రసన్నతయే ఏ విద్యవల్లనైతే మానవుడు దైవభక్తి కలిగి, అల్లాహ్‌ను ప్రేమించి సంతుష్టపర్చగల్గునో ఆ విద్యయే అసలు సత్యజ్ఞానం.

సత్య దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహివ సల్లం అల్లాహ్‌ను ఈ విధంగా ప్రార్థించేవారు. "ఓ అల్లాహ్! ఉపయోగకారియగు జ్ఞానం నాకు ప్రసాదించుము. మరియు నా జ్ఞానమును అభివృద్ధి పర్చుము"

*(బుఖారి & ముస్లిం)*

ఆయన ఈ విధంగా కూడా ప్రార్థించేవారు. "ఓ అల్లాహ్! నాకు ఉపయోగకారియగు విద్య ప్రసాదించుము మరియు నిరుపయోగకారియగు విద్య నుండి నన్ను దూరముగా ఉంచమని నిన్ను వేడుకొనుచున్నాను.

*(నసాయి & ఇబ్నెమాజ)*

జ్ఞానం వల్ల మానవునికి సంతృప్తి లభిస్తుంది. జ్ఞానవంతుడు తనకు మించిన వాని పట్ల ఈర్ష్య ద్వేషం చెందడు. జ్ఞానాభివృద్ధితో పాటు దైవభక్తి కూడా అభివృద్ధి చెందుతుంది. అంతేకాక అతనియందు వినయ విధేయతలు కూడా పెరుగుతాయి. అతను దేవుని కొరకే జీవిస్తాడు. గానీ ధనధాన్యాల కోసం కాదు. దేవుని కొరకే తన ప్రాణం అర్పిస్తాడు.

దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్ ఒక ప్రవచనంలో ఇలా తెలిపారు. దేవుడైన అల్లాహ్‌ను మరువకుము. ఆయన నిన్ను తప్పక రక్షించును అల్లాహ్‌ను స్మరిస్తూ ఆయన ఆదేశాల ప్రకారం ఆచరించుము. అపుడు అల్లాహ్ నీ యెదుట నీకు సమీపముగా ఉండినట్లు కనుగొంటావు. సంతోష సమయములో అల్లాహ్‌ను మరువకుము. ఆయన నీ దుఃఖ స్థితిలో నిన్ను మరువక నీకు సుఖస్థితి ప్రసాదించును.

## ఏకదైవారాధన - మానవ ప్రవర్తనా సంస్కరణ

ఓ మానవులారా! మిమ్మల్ని మీ పూర్వికులను సృష్టించిన ప్రభువు (అల్లాహ్) నే ఆరాధించండి. ***(ఖుర్ఆన్ 2వ సూర బఖర 21 వాక్యం)***

ఏక దైవరాధన మానవ ప్రవర్తనను ఏవిధంగా సంస్కరించునో తెలుసుకునేముందు కొన్ని ముఖ్య విషయాలు తెలుసుకుందాం. భౌతిక వాదం మరియు నాస్తికతను అంగీకరించిన వ్యక్తి జీవితంలో భౌతిక ప్రయోజనాలు. స్వార్దం మనో కాంక్షలను మించి వేరే ఏమీ ఉండజాలదు. కొన్ని రొట్టెముక్కలు, కామ వాంఛలు, రాజకీయ పదవులు, నృత్యగాన సమావేశాలు, భోగభాగ్యాల సామాగ్రి ప్రతియేటా పెరిగే బ్యాంకు బ్యాలెన్సు ఇవి మాత్రమే వారి జీవితం యొక్క తొలి మరియు తుది లక్ష్యం. భౌతికవాదంలో సత్ప్రవర్తన, మానవత్వం మొదలగు పదాలక చోటులేదు. మానవుడు కూడా అభివృద్ధి చెందిన ఒక పశువేనని దాని అభిప్రాయం. అందువల్లనే భౌతికవాదులు పశువులను, మృగాలను తమకు ఆదర్శంగా భావిస్తారు. తమ స్వల్ప ప్రయోజనాల కోసం అతిహీన స్థితిన భరించడానికి

మరియు దౌర్జన్యం సహించడానికి కూడా వెనుకాడదు. వారి స్థితి పూర్తిగా శునకాన్ని పోలి ఉంటుంది. ఎందుకంటే శునకం ఒక చిన్నరొట్టె ముక్క కోసం తనతోక ఊపుతూ తన నాలుకను బయటకు తీసి చూపుతూ ఉంటుంది. ఒక చిన్న ఎంగిలి ఎముక కోసం తన తోటి కుక్కలను చెండాడు తుంది. నీచ దశాభావనకు గురియైన ఈ మానవుడు ధనానికారాలు పొందగానే ఉచ్ఛదశాభావన మరియు గర్వహంకారాలకు ప్రతిరూపంగా నిలుస్తాడు. ఒకప్పుడు దైవనాస్తికతను నిరాకరించిన ఈ మట్టిబొమ్మ మానవుడు స్వయంగా తానే దేవుడనే భావనకు గురియవుతాడు. ఇక అతని దౌర్జన్యం నియంతృత్వాలకు అంతూ, హద్దులుండవు. నాస్తికతా దృక్పథం ప్రజలలో వ్యాపించగానే ఈ లోకంలో స్వార్ధం, ద్రోహం, అక్రమ సంపాదన, దొంగతం, దోపిడి, జగడం, పోట్లాట, వినాశం మొదలైనవన్నీ పెచ్చురిల్లిపోతాయి. మానవ సమాజం ఆకలిగొన్న తోడేళ్ళవలె, రక్తదాహం గల మృగాలవలె భయంకర పిశాచాలవలె మారిపోతుంది. భౌతికవాదాన్ని నాస్తికతను స్వీకరిం!ఏచిన తర్వాత మానవునికి లభించే ఫలితం ఇదే కానీ మానవుని అసలు గమ్యస్థానం ఇదేనా?

పై విషయాల ద్వారా నాస్తికత ఒక భయంకర వినాశకారియని ఋజువైంది. ఇక అంతకంటే మించిన ఒక భయంకర వినాశకాల గురించి తెలుసుకుందాం. అదియే బహుదైవారాధన, ఇది నాస్తికత కంటే అతి నీచం. నాస్తికత వల్ల మానవుడు పశువుగా మారిపోతాడు. గాని బహుదైవారాధనా స్వీకారం వల్ల పశువులను పూజించే నీచ దశకు అధోగతికి దిగజారుతాడు ఒక్క పశువులను మాత్రమే గాక నదులు, సముద్రాలు, కొండలు పర్వతాలు, మట్టి, ధూళి, అగ్ని, పాములు, త్రేళ్ళు, క్రిములు, కీటకాలు, మొక్కలు, వృక్షాలు, స్త్రీ – పురుష మర్మాంగాలు ఈ విధంగా ప్రతీ వస్తువును తనకు దైవంగా భావిస్తాడు. వాటినే భాగ్యధాతలుగా భావించి వాటి ఎదుట సాష్టాంగాలు చేస్తాడు. మానవుడి కొరకు ఇంతకంటే దిగజారిన నీచదశ మరియు అధోగతి వేరే యేమైనా కాగలదా?

అసలు దైవాన్ని విడనాడి ప్రతీ చిన్నా, పెద్దా వస్తువులను దైవంగా భావించి యెదుట వంగి దండాలు పెట్టి సాష్టాంగాలు చేసి నీచదశకు అదోగతిపాలైన వ్యక్తి స్వయంగా తానే దేవుడనే భావనకు గురియై ప్రజలను కూడా నమ్మింపజూస్తాడు. అనగా ధార్మిక పీఠాలను అలంకరించే పెద్దలు తామే దైవమని, దేవుని అవతారమని బొంకుతూ ప్రజలచేత నమ్మిస్తాడు. సామాన్య ప్రజలు మోసపోయి ఆ బూటకపు, కపట మూర్తులనే దైవాలుగా దైవ అవతారాలుగా నమ్మి వారిని పూజించడం వల్లనే తమకు మోక్షం లభిస్తుందని మూఢంగా విశ్వశిస్తారు.

నాస్తికత, బహుదైవారాధన ఈ రెండింటివల్ల దుష్ఫలితాలే జనిస్తాయి. గాని సత్ఫలితం లభింపజాలదు. ఇస్లాం బోధించిన ఏక దైవారాధనను నిరాకరించటం వల్లనే మానవజాతి సత్ఫలితాలను కోల్పోయి దుష్ఫలితాలకు గురైంది. యదార్ధమేమిటంటే అల్లాహ్ ఒక్కడే ఆరాధ్యుడు. ఆయన తప్ప వేరే ఎవరూ ప్రభువు పోషకుడు భాగ్యదాత, రక్షకుడు కాజాలదు. జీవణ్మరణాలు లాభనష్టాలు ఉచ్ఛనీచాలు ధనాధికారాలు అన్నీ అల్లాహ్ చేతిలోనే ఉన్నాయి. ఎవరైనా సరే రాజు, మత గురువు, ప్రవక్త, సజ్జనుడు, దైవదూత, జంతువు, పశువు, వస్తువు ఈ విధంగా ఎవరైనా సరే వారికి ఆరాధింపబడే హక్కు లేదు. ఎందుకంటే వీరందరూ అల్లాహ్‌కు దాసులే వారు కూడా అల్లాహ్‌నే ఆరాధించాలి. మానవుడు ఈ భూలోకంలో ఒక ప్రతినిధి మాత్రమే. దేవుడు అన్నవారికి ఈ గుణములు కలిగి ఉండాలి. తల్లిదండ్రి గాని, పుట్టుక చావుగాని, భార్య పిల్లలుగాని, అలసట కునుకు వీటికి అతీతముగా ఉన్నవాడే దేవుడు.

ఈ విధంగా మానవుడు ఇతర సృష్టిరాశుల యెదుట వంగి హీనం కాకుండా నీచదశకు దిగజారకుండా భద్రపడి తన ఉన్నత స్థానాన్ని అందుకోగలడు. ఏకదైవారాధన వల్ల ప్రాప్తమయ్యే ఈ ఉన్న స్థానం మరియు ఉన్నత స్థితి వేరే ఏ విధంగానూ లభింపజాలదు. ఏక దైవారాధన యొక్క సత్ఫలితాలు అనేకం. వాటిలో కొన్నింటిని తెలుసుకుందాం. మానవుడు పట్టపగ్గాలు లేని విచ్చలవిడి జంతువు కాదని, తన ప్రభువు యెదుట తన చేతులకు సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉందని ఏకదైవారధన

వల్లనే తెలుస్తుంది. మానవుడు దేవుని దాసుడే గాని మనోకాంక్షలకు దాసుడు కాదని అతని జీవిత లక్ష్య క్రమం క్రమపద్ధతిలో భౌతిక ఆశయాల సిద్ధికాదని మానవత మరియు సన్మార్గం ఆచరించి దేవుని సంతృష్టపర్చి, శాశ్వత స్వర్గభాగ్యాలను పొందుటయే తన జీవిత లక్ష్యమని అతనికి అర్ధమవుతుంది. అతను అక్రమ ప్రయోజనాలు మరియు మనోకాంక్షల అందమైన వలలో చిక్కుకుంటే సర్వలోక ప్రభువైన అల్లాహ్ తనపట్ల కోపగించి విచారణ దినాన తనను ఘోరమైన శిక్షకు గురిచేయునని గ్రహించి దుష్కార్యాలను విడనాడి సత్కార్యాలు చేస్తూ తాము తాను కృతార్థుడై ఈ లోకంలో శాంతి శుభాలు ఏర్పడుటకొరకు తోడ్పడిన వాడవుతాడు. ఏకదైవారాధకుని జీవిత లక్ష్యం ఏమిటంటే ప్రజలకు దైవేతర ఆరాధనల నుండి నివారించి ఒకే ఒక దేవుడైన అల్లాహ్ ఆరాధన వైపుకు మరల్చాలి. మానవుడు ఈ బాధ్యత తెలిసికూడా దాన్ని నెరవేర్చకపోతే లేదా తనకు తాను దైవంగా జేసి ప్రదర్శిస్తే అతనికి ఘోర శిక్ష తప్పదు. వ్యక్తికి, సమాజానికి జాతికి, సర్వమానవాళికి తప్పనిసరి. సద్గుణాలకు ఉదాహరణ : సత్కార్యాలు, సత్యసంధత, వాగ్దాన నిర్వహణ, నీతి, న్యాయం, న్యాయ రక్షణ, దయ, కరుణ, విధి నిర్వహణ, సత్య సహకారం మొదలగునవి. ఈ సద్గుణాలు ఉన్న వ్యక్తి ఉన్నత వ్యక్తి అనడంలో ఎటువంటి సందేహం లేదు. అతని ప్రతి అడుగునా ఆనందం లభిస్తుంది. అతని ఉనికి పూర్తి సమాజం కొరకు ప్రయోజనకరం అవుతుంది. ఈ సద్గుణాలు పూర్తి జాతిలో ప్రసరిస్తే ఆ జాతిలో సోదర భావం, ప్రేమ, ఐకమత్యం ఏర్పడతాయి. ఆ జాతి క్లిష్ట సమస్యలు చిటికెల్లో పరిష్కారమవుతాయి. దాని కోసం కృతార్ధతా ద్వారాలు తెరుచుకుంటాయి. దానికి ఉనికి ఇతర జాతులకు నిదర్శనం అవుతుంది.

ఇక దుర్గుణాలను చూడండి. అవినీతి వాగ్దానభంగం, ద్రోహం, మోసం, అన్యాయం, అసత్యం, దౌర్జన్యం, కఠిన మనస్తత్వం, బాధ్యతా విస్మరణ మొదలగునవి. ఇవి అతి దిగజారిన దుర్గుణాలు. ఈ దుర్గుణాలు గల వ్యక్తిని రాక్షసుడు అనడంలో సందేహం లేదు. అటువంటి వ్యక్తి పూర్తి సమాజానికి, పూర్తి జాతికి, సర్వమానవాళికి ఒక శాపం వంటివాడు. ఈ దుర్గుణాలు పూర్తి జాతిలో ప్రభావిత చేస్తే, ఆ జాతి ఇతర జాతులన్నిటికి

ఒక శాపం అవుతుంది. ఈ దుర్గుణాలు సర్వమానవాళి యందు ప్రసరిస్తే ఈ లోకం సుఖశాంతుల కోసం అల్లాడిపోతుంది. మానవాళి శక్తులు పరస్పర యుద్ధంలో మునిగి ఈ లోకం నరకకూపంగా తయారవుతుంది.

సారాంశమేమిటంటే ఈ లోకంలో సద్గుణాల ప్రాముఖ్యత మరియు అవసరం చాలా ఉంది. ఈ అవసరం ప్రతీ కాలంలోను ఉండేది గానీ నేడు దాని అవసరం చాలా పెరిగిపోయింది. ఎందుకంటే నేటి మానవుడు వివిధ విద్యారంగాల్లో ప్రగతి సాధించాడు. అత్యాధునిక పరికరాల ద్వారా అతను కనురెప్పపాటులో లక్షలాది ప్రజలను నాశనం చేయగోరుతున్నాడు. అంతేకాక లక్షలాది ప్రజల కొరకు కృతర్థతావ కాసం ఏర్పరచగల్గుతున్నాడు. అతను భూగ్రహాన్ని విడనాడి ఆకాశంలోని ఇతర గ్రహాలపైన తన ఆధిపత్యం కోసం కలలు కంటున్నాడు. ప్రయాణ సాధన సహాయంతో పూర్తి భూమండలం ఒకే ప్రాంతంలా కానవస్తుంది. దీని పరిధి చంద్రుడు మరియు అంగారకుని వరకు వ్యాపించినట్లు అనిపిస్తుంది. ఇటువంటి తరుణిలో ప్రపంచ జాతులు దుర్గణాలకు లోనైతే ఇక మానవాళి గతియేమిటో వేరే చెప్పనక్కర్లేదు.

## ఏకదైవారాధన సంఘ సంస్కరణ

ఏక దైవారాధన వల్ల స్పష్టమయ్యేదేమిటంటే అల్లాహ్ ఒక్కడే సృష్టికర్త, ప్రభువు, అసలు ఆరాధ్యుడు సర్వసృష్టిరాశులూ ఆయనకే సాష్టాంగం చేస్తూ మనసా, వాచా ఆయనపట్ల విధేయత కలిగి ఉన్నాయి. కాబట్టి మనం కూడా ఆయన యెదుటనే వంగాలి. ఆయనే సృష్టికర్త లాభనష్టాలకు యజమాని జీవన్మరణాల అధికారి. మనం చేతులు చాచి ఆయన ఎదుటనే భిక్షం కోరాలి. సహాయం కోసం ఆయన్నే వేడుకోవాలి. ఒకప్పుడు వివిధ దుర్గుణాలకు లోనైన ఉన్న అరబ్బువాసులు ఇస్లాం బోధించిన ఏకదైవారాధన ధృక్పధాన్ని స్వీకరించి పరిశుద్ధులై సకల సదాచరణలకు ఆదర్శంగా నిలిచారు.

మానవుడు ధన సంపదల యాజమాన్యం తనదేనని భావించునంత వరకు అతని మనసు దురాశ, పిసినారితనం, ఈర్ష్య, ద్వేషం మొదలగు మలినాలతో నిండి ఉంటుంది. కానీ అతను ఏకదైవాధన యందు విశ్వాసం

ఉంచుతూ, సర్వభూమ్యాకాశాల సంపదా నిధుల యాజమాన్యం అల్లాహ్ ఒక్కనికే చెందునని గ్రహించినంతనే, తాను ఆ ధన సంపదల అసలు యజమాని కాడని, తానొక గణకుడు మాత్రమేనని తెలుసుకుంటాడు. ధనం వల్ల అతి సంతోషమూ కలుగదు లేమి వల్ల విచారమూ కలుగదు.

ఈ సిద్ధాంతం తెలిసిన తర్వాత, అల్లాహ్ యందు విశ్వాసం ఉంచు వ్యక్తి దురాశ, పిసినారితనం, ఈర్ష్య మొదలగు దుర్గుణాలను ఎలా లోనవుతాడు? అతని సిరి సంపదలన్నీ తాత్కాలిక వ్యాసాలే. అతని మరణం తర్వాత వాటిపై అతని అధికారం ఉండదని తెలిసిన తర్వాత ఇక దురాశా పిసినారితనాలు ఎందుకు?

ఏకదైవారాధకుడైన విశ్వాసి తాను పాలకుడుకానని, పాలితుడని యజమానికాదని, సేవకుడని, పోషకుడు కాదని, పోషితుడని, ప్రభువు కాదని, దాసుడని నమ్మిన తర్వాత అతని మనసులో గర్వం, అహంకారం మొదలగు మలినాలు ఎలా చోటు చేసుకోగలవు?

ఒక వ్యక్తి ఏక దైవారాధన యందు విశ్వాసం ఉంచి అల్లాహ్ ఒక్కడే లాభనష్టాల యజమాని అని నమ్మిన తర్వాత ఇహలోక శక్తులపట్ల గల ఆశా భయాలన్నీ దూరమైపోతాయి. ఆశాభయాలను ఒకే ఒక దేవుడైన అల్లాహ్ పట్లనే కేంద్రీకరిస్తాడు. అతని కోపోద్రేకాలు మటుమాయ మవుతాయి. తన జీవితంలో ఎదురయ్యే ప్రతి బాధా, దేవుని హెచ్చరికయని, తన తప్పులను సరిదిద్దుకోవటం కోసమేనని, దాని వల్ల దైవసామీప్యం లభిస్తుందని, షైతాను గాయపడి పారిపోతాడని నమ్మిన తర్వాత ఇక కోపోద్రేకాలు మనసుసలో ఎలా ప్రవేశింపగలవు?

ఒక వ్యక్తి పరుల లాభ నష్టాలు కలిగించగలరనే ఆశాభయాలు కలిగి ఉండటం వల్లనే వారిని సంతృప్తపరచడానికై సంకల్ప శుద్ధిని విడనాడు పర పొగడ్తల అపేక్షకు, ఆడంబరాలకు లోనవుతాడు. కానీ ఒక్క అల్లాహ్‌యందు మాత్రమే విశ్వాసం ఉంచిన ఏకదైవారాధకుడు తన విశ్వాస బలిమి వల్ల, పరిపొగడ్తల అపేక్షను విడనాడి, సంకల్ప శుద్ధితో తన కార్యాలను అల్లాహ్ కొరకే అంకితం చేస్తాడు.

సారాంశమేమిటంటే మానవుడు బహుదైవారాధనను విడనాడి, ఏకదైవారాధనను స్వీకరించి ఒకే ఒక అల్లాహ్‌ను ఆరాధింపనారంభిస్తే దుర్గుణాలన్నీ దూరమై సద్గుణాలన్నీ జనిస్తాయి. "నమాజును స్థాపించండి నిశ్చయముగా నమాజు అశ్లీల కార్యాలనుండి నివారించును"

(ఖుర్‌ఆన్ సూర 29, అన్‌కబూత్ 45 వాక్యం)

## ఇస్లాం ఒక సద్గుణ బోధిని

మనందరి దేవుడైన అల్లాహ్ తన సత్యప్రవక్త ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్‌ను సంబోధిస్తూ ఇలా పలికెను. ఓ ప్రవక్తా! నిశ్చయంగా తమరు అత్యుత్తమ సద్గుణాలు కలిగి ఉన్నారు.

***(ఖుర్‌ఆన్ 68 సూర అల్‌ఖలమ్ 4వ వాక్యం)***

దైవ ప్రవక్త గారి సతీమణియైన ఆయిషా (రజియల్లాహు అన్‌హా) ఇలా తెలిపారు. దైవ ప్రవక్త ముహమ్మద్ గారి సద్గుణాలు దివ్య ఖుర్ ఆన్‌ను ప్రతిరూపంగా ఉండేది. ***(ముస్లిం2 పేజి 245)***

పై ప్రవచనం అర్థం ఏమిటంటే దైవప్రవక్త ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్ దివ్య ఖుర్‌ఆన్ ఆదేశాలు బోధించటమే కాక. దివ్య ఖుర్‌ఆన్ వేటి గురించి ఆదేశించెనో వాటి ప్రకారం ఆచరిస్తూ, వేటి గురించి వారించెనో వాటికి అతి దూరంగా ఉండేవారని అర్ధమగుచున్నది.

ఇక ఇస్లామీయ సద్గుణాలు మరియు సత్ప్రవర్తనల గురించి కొన్ని ముఖ్య విషయాలు తెలుసుకుందాం. దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా తెలుపబడింది. "క్షమా గుణమును అలవర్చుకొనుము. సత్కార్య బోధన చేయుము. అజ్ఞానులతో వృధావాదన చేయకుము."

***(ఖుర్ ఆన్ 7వ సూర అల్ ఆరాఫ్ 199వ వాక్యం)***

దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్ ఇలా పలికిరి. "సద్గుణాలను సంపూర్ణం చేయుటకే నన్ను పంపడం జరిగింది." ***(అహ్మద్)***

ఇస్లాం ధర్మంలో ఏకదైవోపాసన ప్రవక్త ఆచరణ నమాజు, ఉపవాసం, విధిదానం, హజ్, మొదలగునవి. మూలాదేశాలతోపాటు సద్గుణాలకు కూడా అత్యంత ప్రాముఖ్యత ఇవ్వబడింది.

దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్ ఇలా పలికిరి. ఉపవాసి మరియు "రేయింబవళ్ళు దేవుని ఆరాధిస్తూ ప్రార్థించటం వలన ఎంతట గొప్ప స్థానం లభించునో అంతటి గొప్ప స్థానాన్ని మానవుడు తన సద్గుణాల ద్వారా కూడా పొందగలడని బోధించారు.

***(అబుదావూద్ 3, హదీస్ 4798, 707 పేజి)***

మరొక ప్రవచనంలో ఇలా తెలుపబడింది. "విచారణ దినమునాడు న్యాయ త్రాసులో సద్గుణములను మించి తూగు పుణ్యకార్యాలు మరొకటి ఉండవు". "సద్గుణ సంపన్నుడైన వ్యక్తి తన సద్గుణాల ద్వారా ఆరాధన సంపన్నుడైన వ్యక్తి యొక్క ఉన్నత స్థానానికి చేరుకోగలడు."

***(అబుదావూద్ 3, హదీస్ 4799 పేజి 707 & తిర్మిజి)***

నవ్వాస్ బిన్ సమ్ ఆన్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త సల్లెల్లాహు అలైహివ సల్లమ్‌ను ఇలా ప్రశ్నించాను, సత్కార్యం మరియు దుష్కార్యాల గూర్చి ఆయన ఇలా తెలియజేశారు. నీవు చేసే ఏ పని గూర్చి నీ మనస్సులో తప్పు అని గుచ్చుకుందో అది ప్రజలకు తెలిస్తే బాగుండదని భావించేదే దుష్కార్యం. ఉత్తమ నైతికతకు మారుపేరే సత్కార్యం. ***(ముస్లిం 4, పేజి 205)***

మరొక ప్రవచనంలో ఇలా పేర్కొనబడింది. "సద్గుణాలకు మించిన సంపద లేదు". ***(నసాయి)***

ఇంకొక ప్రవచనంలో ఇలా బోధింపబడింది. "సద్గుణవంతులే అల్లాహ్‌కు అతి ప్రియమైన వారు." ***(తిబ్రానీ)***

దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్ ఈ విధంగా కూడా ఉపదేశించారు. "ఇహలోకంలో ఎవరైతే దుర్గుణాలు కలిగి గర్విష్టిగా ఉంటారో వారు స్వర్గంలో వెళ్ళలేరు.

***(అబుదావూద్ 3, హ॥ 4801, పేజి 708)***

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం దైవప్రవక్త ఇలా ప్రశ్నించగా నేను విన్నాను. "మీలో నాకు ప్రియుడు మరి ప్రళయదినాన నాకు తోడుగా ఉండే వ్యక్తి ఎవరో మీకు తెలుపనా?" తప్పక తెలపండి అని సహచరులు విన్నవించగా "మీలో సత్ప్రవర్తన గల వ్యక్తి" అని ఆయన చెప్పారు.

***(అహ్మద్)***

ఇక ఇద్దరు స్త్రీల వేర్వేరు ప్రవర్తనలు మరియు వాటి ఫలితాల గురించిన ఒక వృత్తాంతం తెలుసుకుందాం. ఒక స్త్రీ రాత్రంతా మేల్కొని ఆరాధనా ప్రార్ధనలు చేస్తూ ఉండేది. ఎక్కువగా ఉపవాసం ఉండేది. ధానధర్మాలు అత్యధికంగా చేసేది. కానీ తన నోటి దురుసుతనం వలన ఇరుగుపొరుగు వారిని ఇబ్బంది కలిగించేది.

మరొక స్త్రీ ముఖ్యమైన తప్పనిసరియైన ఆరాధనలే చేస్తూ ఉండేది. తప్పని విధియైన ఉపవాసాలే ఉండేది. తన స్తోమత ప్రకారం పేదవారికి దానం చేసేది కానీ సద్గుణవతి కావటం వలన యెవరినీ బాధించేది కాదు.

దైవప్రవక్త సల్లెల్లాహు అలైహివ సల్లం గారి అనుచరులు ఈ ఇద్దరు స్త్రీల ఫలితాల గురించి ప్రశ్నించగా దైవ ప్రవక్త సల్లెల్లాహు అలైహివ సల్లమ్ ఇలా సమాధానమిచ్చారు. "మొదటి స్త్రీ తన దుష్ప్రవర్తన దుర్గుణాల వల్ల నరకశిక్ష అనుభవించటం తప్పనిసరి. రెండవ స్త్రీ తన సత్ప్రవర్తన సద్గుణాలవల్ల తప్పకుండా స్వర్గప్రవేశం చేయును." ***(అహమద్ బైహఖీ)***

ఇక మరొక ఉపదేశపూరిత ప్రవచనాన్ని తెలుసుకుందాం.

ఒక గ్రామ నివాసియైన ముస్లిం దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్ గారి సమక్షానికి వచ్చి ఇలా విన్నవించుకున్నాడు. ఏ కార్యము వల్లనైతే నేను స్వర్గప్రవేశం చేయగలనో ఆ కార్యములు నాకు తెలపండి అని అడిగాడు. అపుడు దైవ ప్రవక్త సల్లెల్లాహు అలైహివ సల్లమ్ ఇలా ఉపదేశించారు. 1) బానిసకు స్వేఛ్ఛ కల్పించుము 2) ఋణగ్రస్తుని ఋణ బంధనము నుండి విముక్తి కలిగించుము 3) బంధువులకు చేయూత నిమ్ము 4) పై కార్యములేమీ చేయలేకపోతే కనీసం ఆకలిగొన్నవారికి అన్నం పెట్టుము 5) దాహం గల వారికి నీరు త్రాగించుము 6) మంచిని బోధించండి 7) చెడును నివారించండి ఇలా చేయలేకపోతే కనీసం నాలికను అదుపులో ఉంచుకోండి.

ఇక ఖుర్ఆన్ వాక్యాలు చూడండి. కరుణామయుని (నిజ) భక్తులు భూమిపై (విర్రవీగకుండా) నమ్రతగా నడుస్తారు! మూర్ఖులు వారితో వాదనకు

దిగితే "మీకు సలాం" అంటారు. వారు తమ ప్రభువు సన్నిధిలో నిలబడి ప్రార్థన చేస్తూ సాష్టాంగపడుతూ రాత్రిళ్ళు గడుపుతారు. అదీగాక దైవాన్ని వేడుకుంటూ "ప్రభూ! మమ్మల్ని నరకయాతన నుండి కాపాడు. ఆ యాతనలు ఎంతో బాధాకరంగా, దారుణంగా ఉంటాయి. నరకం పరమచెడ్డ నివాసస్థలం"అని అంటారు. ***(ఖుర్‌ఆన్ 25వ సూర ఫుర్ఖాన్ 63-66 వాక్యం)***

వారు తమ సంపద వినియోగిస్తున్నపుడు దుబారా ఖర్చు చేయరు. అటు పిసినారితనం కూడా వహించరు. వారి ఖర్చు ఆ రెండు అతి చర్యలకు మధ్యస్తంగా ఉంటుంది. వారు ఒక్క దేవుణ్ని తప్ప మరెవరినీ ప్రార్థించరు. దేవుడు నిషేధించిన ఏ ప్రాణినీ అన్యాయంగా హతమార్చరు. వ్యభిచారానికి ఏమాత్రం తావివ్వరు.

ఈ పాడు పనులు చేసేవాడు మటుకు తన పాపఫలం అనుభవిస్తాడు. ప్రళయం రోజు అతనికి (నరకంలో) రెట్టింపు శిక్ష విధింపబడుతుంది. అందులోనే అతను ఎల్లకాలం అవమానభారంతో క్రుంగిపోతూ పరమనీచంగా పడివుంటాడు. అయితే పశ్చాత్తాప హృదయం తో క్షమాపణ కోరుకొని, దానితోపాటు సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేయడం మొదలెడితే అలాంటి మనిషికి శిక్ష విధించబడదు పైగా దేవుడు అలాంటి వారి (గత) ఖర్మలను, సత్కర్మలుగా మార్చివేస్తాడు. ఆయన గొప్ప అనుగ్రహశాలి. పరమ దయాళువు.

***(ఖుర్‌ఆన్ 25వ సూర ఫుర్ఖాన్ 70 వాక్యం)***

పశ్చాత్తాపంతో క్షమాపణ కోరుకొని సదాచార వైఖరి అవలంభించి నవాడు నిజానికి మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెంది దేవునివైపు మరలి వచ్చినవాడవుతాడు. ***(ఖుర్‌ఆన్ 25వ సూర ఫుర్ఖాన్ 71 వాక్యం)***

(కరుణామయుని నిజభక్తులు) అసత్యానికి ఎన్నడూ సాక్షులుగా ఉండరు. ఎప్పుడైనా వారు పనికిమాలిన వ్యవహారం మీదుగా పోవలసివస్తే దాన్ని పట్టించుకోకుండా హుందాగా, గౌరవప్రదంగా దాటి వేస్తారు. వారికి వారి ప్రభువు సూక్తులు విన్పించి హితోపదేశం చేయటం జరిగితే వారు అంధులుగా, బధిరులుగా మారి వాటిని నిర్లక్ష్యం చేయరు. వారు "ప్రభూ!మా భార్యపిల్లల ద్వారా మా కంటికి చలువ ప్రసాదించు. మేము దైవభీతిపరులకు నాయకులయ్యేలా చెయ్యి" అని ప్రార్థిస్తారు. **(ఖుర్‌ఆన్ 25వ సూర ఫుర్ఖాన్ 72-74 వాక్యం)**

మరోచోట ఈ విధంగా ఉంది. సత్ప్రవర్తనకు సంబంధించిన ఆదేశాలు : మీరు ఒక్క (నిజ) దేవుణ్ని (అల్లాహ్) తప్ప మరెవరినీ ఆరాధించకండి. తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మసులుకోండి. మీ ముందు వారిద్దరిలో ఎవరైనా వృద్ధులై ఉంటే వారిని "ఉఫ్" అని కూడా అనకండి. కసురుకుంటూ విధిలించి మాట్లాడకండి. వారితో గౌరవంగా మాట్లాడండి; దయార్ద్రహృదయంతో, వినయంతో వారి ముందు తలవంచి ఉండండి. (వారిపట్ల గౌరవాదారణలతో) "ప్రభూ! వీరు నన్ను చిన్నతనంలో ఎలా కరుణతో, వాత్సల్యంతో పెంచి పోషించారో అలా నీవు వారిని కరుణించు" అని ప్రార్థించండి.

***(ఖుర్ఆన్ 17వ సూర బని ఇస్రాయిల్ 23,24వ వాక్యం)***

మీ హృదయంలో ఏముందో మీ ప్రభువుకు బాగా తెలుసు. మీరు గనక సజ్జనులై ఉంటే (పశ్చాత్తాపంతో) తనవైపు మరలేవారందర్నీ ఆయన క్షమిస్తాడు. ***(ఖుర్ఆన్ 17వ సూర బని ఇస్రాయిల్ 25వ వాక్యం)***

బంధువులు నిరుపేదలు, బాటసారుల హక్కులు నెరవేర్చండి. దుబారా ఖర్చు చేయకండి. దుబారా ఖర్చు చేసేవారు షైతాన్ సోదరులుగా పరిగణించబడతారు. షైతాన్ తన ప్రభువుకు కృతఘ్నుడైపోయాడు.

***(ఖుర్ఆన్ 17వ సూర బని ఇస్రాయిల్ 26-27వ వాక్యం)***

మీరు దేవుని అనుగ్రహం ఆశించి దానకోసం నిరీక్షిస్తూ (పేదలకు సహాయం చేయలేక) వారి నుండి తప్పించుకోవలసివస్తే, వారికి మృదువుగా జవాబివ్వండి. (ఖుర్ఆన్ 17వ సూర బని ఇస్రాయిల్ 28వ వాక్యం)

మీరు మీ చేతిని (ఏమాత్రం దానం చేయకుండా) మెడకేసి కట్టి ఉంచకండి. అలాగే దాన్ని పూర్తిగా తెరచి ఉంచడం కూడా సరికాదు. అలాచేస్తే మీరు నిందుతులయి, నిస్సహాయులైపోతారు. నీ ప్రభువు తాను కోరిన విధంగా కొందరికి అధికంగా ఉపాధినిస్తే, మరి కొందరిన లేమికి గురిచేస్తాడు. ఆయనకు తన దాసుల స్థితిగతులు బాగా తెలుసు. ఆయన వారిని చూస్తూనే ఉన్నాడు. ***(ఖుర్ఆన్ 17వ సూర బని ఇస్రాయిల్ 29-30వ వాక్యం)***

దారిద్ర్య భయంతో మీ సంతానాన్ని చంపుకోకండి. మేము వారికీ ఆహారమిస్తున్నాం. మీకు ఇస్తున్నాము. వారిని చంపడం ఘోరమైన పాపం.

***(ఖుర్ఆన్ 17వ సూర బని ఇస్రాయిల్ 31వ వాక్యం)***

వ్యభిచారం దరిదాపులకు పోకండి. అది చాలా హేయమైనది. పరమచెడ్డదారి. ***(ఖుర్ఆన్ 17వ సూర బని ఇస్రాయిల్ 32వ వాక్యం)***

న్యాయసమ్మతంగా తప్ప దేవుడు నిషేధించిన ఏ ప్రాణిని హతమార్చకండి. ఎవరైనా అన్యాయంగా హతమార్చబడితే అతని వారసులకు మేము బదులు తీర్చుకునే అధికారం ఇచ్చాము. అయితే వారసుడు (హంతకుడ్ని) వధించడంలో హద్దు మీరకూడదు. అప్పుడే అతనికి సహాయం చేయబడుతుంది. ***(ఖుర్ఆన్ 17వ సూర బని ఇస్రాయిల్ 33వ వాక్యం)***

అనాధ పిల్లలు యుక్త వయస్సుకు చేరుకునేవరకు న్యాయ సమ్మతంగా తప్ప వారి సొమ్ము దరిదాపులకు వెళ్ళకండి. (వాగ్దానం) ఒప్పందం నేరవేర్చండి. (వాగ్ధానం) ఒప్పందం గురించి మీరు తప్పని సరిగా (దేవుని ముందు) సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది.

***(ఖుర్ఆన్ 17వ సూర బని ఇస్రాయిల్ 34వ వాక్యం)***

సరైన పాత్రతో పూర్తిగా కొలచి ఇవ్వండి. తూచవలసివస్తే సరైన త్రాసులో తూచి ఇవ్వండి. ఇదే సరైన పద్ధతి. ఫలితం రీత్యా కూడా ఈ పద్ధతే మంచిది ***(ఖుర్ఆన్ 17వ సూర బని ఇస్రాయిల్ 35వ వాక్యం)***

మీకు తెలియని దాని వెంటపడకండి. కళ్ళు, చెవులు, హృదయం వగైరా సమస్త అవయవాల్ని గురించి (దేవునికి) సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. ***(ఖుర్ఆన్ 17వ సూర బని ఇస్రాయిల్ 36వ వాక్యం)***

భూమిపై విర్రవీగుతూ నడవకండి. (ఈ అహంకారంతో) మీరు భూమిని చీల్చి వేయలేరు. పర్వతాల ఎత్తుకు ఎదగనూ లేరు

***(ఖుర్ఆన్ 17వ సూర బని ఇస్రాయిల్ 37వ వాక్యం)***

ఇవన్నీ దుష్కార్యాలు. మీ ప్రభువు దృష్టిలో ఎంతో హేయమైనవి. ఇవి వివేకంతో కూడిన విషయాలు. వీటిని నీ ప్రభువు నీ హృదయ ఫలకంపై అవతరింపజేశాడు.

వినండి! దేవునితో పాటు మరో ఆరాధ్యదైవాన్ని చేసుకోకండి. అలా చేస్తే మీరు నిందుతులై, సమస్త శ్రేయోశుభాలకు దూరమై నరకంలో వేయబడతారు. ***(ఖుర్ఆన్ 17వ సూర బని ఇస్రాయిల్ 38-39వ వాక్యం)***

**వాస్తవ సద్గుణ వంతుల గురించి ఈ విధంగా ఉంది :** మీ ముఖాలు తూర్పు లేక పడమరకు తిప్పుకోవడమే పుణ్యకార్యం కాదు. దేవుణ్ని, అంతిమ దినాన్ని దైవదూతలను, దేవుడు పంపిన (అంతిమ) గ్రంథాన్ని ఆయన ప్రవక్తలనూ హృదయపూర్వకంగా విశ్వసించి, దేవుని మీద ప్రేమాభి–మానాలతో మీకు అత్యంత ప్రియమైన ధనాన్ని బంధువుల కోసం, అనాధల కోసం, నిరుపేదల కోసం, బాటసారుల కోసం సహాయార్ధుల కోసం బానిసల విముక్తి కోసం ఖర్చు చేయాలి. ప్రార్ధనా వ్యవస్థ నెలకొల్పాలి; (పేదల ఆర్థిక హక్కు) జకాత్ చెల్లించాలి. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. కష్టకాలంలో (సత్యాసత్యాల మధ్య జరిగే) పోరాటంలో సహనం వహించాలి. ఇలాంటి సత్కార్యాల చేసేవారే సన్మార్గులు. వారే (దేవునిపట్ల భయభక్తులు కలిగినవారు)
***(ఖుర్ఆన్ 2వ సూర బఖర 177వ వాక్యం)***

కావున అల్లాహ్‌ను గురించిన విధులు మరియు తోటి మానవుల గురించిన బాద్యతలు నెరవేర్చుటమే అసలు సత్కార్యమని పై వాక్యముల ద్వారా స్పష్టమగుచున్నది. మరొక విధంగా చెప్పాలంటే సర్వ సత్య విశ్వాసాలు, సర్వ సత్కార్యాలు మరియు సర్వసద్గుణాలు ఒకే ఒక వాక్యంలో సమకూర్చ బడినది.

ఇక దివ్య ఖుర్ఆన్‌లో పేర్కొనబడిన కొన్ని ఉత్తమ ఇస్లామీయ బోధనలు తెలుసుకుందాం.

సత్యం పలకాలి. సద్బోధన చేయాలి. క్షమాగుణం కల్గి ఉండాలి. అల్లాహ్‌నే నమ్ముకోవాలి. సహనంతో మెలగాలి. అల్లాహ్‌కు ధన్యవాదాలు అర్పిస్తూ ఉండాలి. ఇస్లాంపై స్థిరంగా ఉండాలి. అల్లాహ్ మార్గంలో ప్రాణాలు ధారపోయడానికి కూడా సిద్ధంగా ఉండాలి. దానధర్మాలు చేయాలి. బందువుల, అనాధల, నిరుపేదల, ఇరుగు, పొరుగువారు మొదలగు వారందరిపట్ల మంచిగా ప్రవర్తించాలి. బాటసారులు, యాచకులు మరియు ఖైదీలపట్ల సరిగ్గా వ్యవహరించాలి. వాగ్ధానాలు నెరవేర్చాలి, ఆడినమాట తప్పరాదు. ఎల్లప్పుడూ మంచిమాటలే పలకాలి, పరస్పరం స్నేహాన్ని పెంచాలి, అవహేళన చేయరాదు. తప్పుడు పేర్లతో పిలవరాదు. తల్లిదండ్రుల సేవ చేయాలి. పరస్పరం మేలుకోరుతూ ఉండాలి. న్యాయంగా ప్రవర్తించాలి. సాక్ష్యాన్ని దాచకూడదు. మృధువుగా

మాట్లాడాలి. అహంకారంతో నడవకూడదు. శాంతికై కృషి చేయాలి. ఐకమత్యంగా ఉండాలి. తోటి ముస్లిం పట్ల సోదరభావం కల్గి ఉండాలి. సర్వమానవాళిని సోదరులుగా భావించాలి. ధర్మ సమ్మతమైన రీతిలో స్వయంగా సంపాదించాలి. యాచించడాన్ని హీనంగా భావించి దానికి దూరంగా ఉండాలి; సత్కార్య బోధన, దుష్కార్య నివారణ చేయాలి. సంతానాన్ని చంపుకోరాదు, ఆత్మహత్య చేసుకోరాదు. ఎవరినీ హత్య చేయకూడదు. అనాథలను పోషించాలి, వారి సొమ్మును వారి కొరకు భద్రపరచాలి; తూకంలో, కొలతల్లో హెచ్చు తగ్గులు చేయకూడదు. దుర్మార్గం చేయకూడదు, ఆజ్ఞా విహీనతకు దూరంగా ఉండాలి. అశ్లీల పనులు చేయరాదు. అటువంటి పనులు చేసేవారిని వారించాలి, వ్యభిచారం చేయకూడదు. అనుమతి లేకుండా ఇతరుల గృహాల్లో ప్రవేశించకూడదు. స్త్రీలు పరదా పాటించాలి. మోసం, దగా చేయకూడదు; దృష్టిని, చెవులను, మనసును అదుపులో ఉంచుకోవాలి. సత్కార్యాలు చేయాలి. వృథాపనులు చేయరాదు. నిస్వార్థంగా మెలగాలి. శత్రువులను క్షమించాలి. అపకారులకు ఉపకారం చేయాలి. అనవసరంగా, అతిగా కోపగించకూడదు. ఎదుటి వారిని గౌరవించి మాట్లాడాలి. ఇతరులకు చేసిన మేలు దెప్పి పొడవరాదు. దుష్కార్యాలకు, దుశ్చేష్టలకు దూరంగా ఉండాలి. దొంగతనాలు, దోపిడీలు చేయరాదు. అక్రమంగా ఇతరుల సొమ్ము ఆస్తి ఆక్రమించుకోరాదు; దైవభక్తి, పవిత్రత, సత్‌శీలత కల్గి ఉండాలి. తన గొప్పలు చెప్పుకోరాదు. సమావేశాల్లో కూడా సత్ప్రవర్తనతో వ్యవహరించాలి. బలహీనులకు, నిస్సహాయులకు మరియు స్త్రీలకు ఉపకారం చేయాలి. వారికి తోడ్పడాలి స్త్రీవైతే తన భర్తకు విధేయతగా ఉండాలి; పురుషుడైతే తన భార్యను గురించిన బాధ్యతలు నిర్వర్తించాలి. అసత్య ప్రమాణాలు చేయరాదు. చాడీలు చెప్పరాదు. అపనిందలు మోపరాదు; తమ మర్మాంగాలను ఇతరుల ఎదుట బహిర్గతం చేయరాదు. దేవుడొసంగిన భాగ్యాలను వ్యక్తపర్చాలి. యాచకులను చీదరించుకోరాదు. అనాథలను గద్దించరాదు, పరదూషణ చేయకూడదు. అనుమానించరాదు, అపార్థం చేసుకోరాదు, అందరిపై దయ చూపాలి, సంకల్ప శుద్ధితో ఉండాలి. ఏ పనియైనాసరే పరుల పొగడ్తల కోసం, మెప్పుకోసం చేయరాదు. వడ్డీ, లంచగొండు తనానికి దూరంగా ఉ ండాలి; యుద్ధరంగము నుండి వెనుతిరగరాదు. స్థిరంగా ఉండాలి. ధైర్య

సాహసాలతో ప్రవర్తించాలి. మత్తుపానీయాలు సేవించరాదు. జూద మాడరాదు. ఆకలిగొన్నవారికి కడుపునింపాలి. అంతరంగిక, బహిరంగ అన్నివిధాల నిర్లక్ష్య కార్యాలకు దూరంగా ఉండాలి. ధన వ్యామోహానికి, దూరంగ ఉండాలి. దౌర్జన్యాన్ని నివారించాలి. ఇతరులను నిర్లక్ష్యం చేయరాదు. పాపాలకు అతిదూరంగా ఉండాలి. పరస్పర సద్బోధన చేసుకుంటూ ఉండాలి.

దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లెలాహు అలైహివ సల్లమ్ ఉత్తమ బోధనలు

బంధువులతో బంధుత్వం కలిగి ఉండాలి. పిల్లలను ప్రేమించాలి. పెద్దలను గౌరవించాలి. తన కొరకు కోరుకునేదే ఇతరుల కొరకు కూడా కోరాలి. ఇరుగుపొరుగు వారితో మంచిగా ప్రవర్తించాలి. బానిసలను క్షమించాలి. భార్యబిడ్డలను బాగుగా పోషించాలి. విధవలకు సహాయపడాలి. గ్రుడ్డివారికి చేయూతనివ్వాలి. సర్వ మానవాళి మేలుకోరాలి. ఇతరులకు ఉపయోగపడాలి. అప్పిచ్చిన వారిని గౌరవించాలి. విన్నవించుకునే వారి విన్నపాలు వినాలి. పశుపక్షాదులపై కూడా దయ తలచాలి. సహాయకులకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. రోగులను పరామర్శించాలి. వారి సేవ చేయాలి. అసూయపడరాదు. తమ నాయకునికి విధేయులుగా ఉండాలి. సత్కార్యాలు ఎల్లప్పుడు చేస్తూ ఉండాలి. కఠినంగా కాక మృదువుగా పలకాలి. సంస్కారవంతులుగా ఉండాలి. కోపాన్ని అదుపులో ఉంచాలి. కులవంశాల గొప్పతనంపై గర్వించకూడదు. ఇతరుల గృహాల్లో తొంగి చూడరాదు. తనతోపాటు ఇతరుల కొరకు కూడా ప్రార్థించాలి. అల్లాహ్ ప్రసాదించిన దానితోనే సంతృప్తి పడాలి. తన తప్పుల గురించి అల్లాహ్ సన్నిధిని క్షమాపణ వేడుకుంటూ ఉండాలి. చేసిన తప్పులను బహిరంగ పర్చకూడదు. ఇతరుల లోపాలను రహస్యముగా ఉంచాలి. అతిగా నవ్వకూడదు. పరిహాసం చేయకూడదు. రహస్యాన్ని రహస్యంగానే ఉంచాలి. ముఖస్తుతి చేయరాదు. ఇతరుల సుఖదుఃఖాల్లో పాలుపచుకోవాలి. దురాశ ఉండరాదు. విధిరాత నంగీకరించాలి. మరణించిన వారి కొరకు శోకాలు పెట్టడం, అరుస్తూ ఏడ్వటం నిషేధం. పరస్పరం పోట్లాడుకోరాదు. శత్రువుల మధ్య సంధి చేయించాలి. ఒక ముస్లిం మరొక ముస్లింతో మూడు దినాలకంటే ఎక్కువగా

మాట్లాడకుండా ఉండరాదు. కపటత్వం వుండరాదు. బంధుమిత్రులతో కలసిమెలసి ఉండాలి. ముస్లింలు పరస్పరం సలామ్ చేసుకోవాలి. కరచాలనం చేసుకోవాలి. భుజించుటం, త్రాగటం, ధరించటం, నిద్రించటం, లేవటం, కలవటం మొదలగు వివిధ జీవన రంగాలలో ఇస్లాం ఆదేశాలను పూర్తిగా పాటించాలి. స్త్రీలు కూడా తమ బాధ్యతలు తెలుసుకొని వాటిని సంపూర్ణంగా నిర్వర్తించాలి.

**"సలామ్" సదాచార వివరాలు :** ముస్లింలు పరస్పరం ఎదురైనపుడు కలిసినపుడు ఆనందంతో మేలుకోరుతూ ఎదుటివాని కొరకు ప్రార్థిస్తూ "అస్సలాము అలైకుం" అని పలికితే ఎదుటి ముస్లిం దానికి జవాబుగా "వ అలైకుమ్ అస్సాలామ్" అని పలకాలి.

మీకు ఎవరైనా గౌరవభావంతో సలామ్ చేస్తే అతనికి మీరు అంతకంటే ఉత్తమమైన పద్ధతిలో ప్రతి సలామ్ చేయండి. లేదా కనీసం అదే విధంగానైనా చేయండి. ***(ఖుర్ఆన్ 4వ సూర నిసా 86వ వాక్యం)***

దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్ ఈవిధంగా ఉపదేశించారు.

అబుహురైరా (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త సల్లెల్లాహు అలైహివ సల్లమ్ ఇలా ప్రబోధించారు. మీరు (ఇస్లాం) విశ్వసించనంత వరకూ స్వర్గంలోకి ప్రవేశించలేరు. అలానే మీరు పరస్పరం ప్రేమించు కోనంతవరకూ (పూర్తిగా) విశ్వాసులు కాలేరు. మీరు ఒకరొకర్ని ప్రేమించు కోవాలంటే ఏం చేయాలో నేను మీకు తెలుపనా? మీ మధ్య సలాంను సర్వసామాన్యం చేసుకోండి. ఒకరికొకరు ఎక్కువగా సలాములు చేస్తూ ఉండండి. ***(ముస్లిం 1, పేజి 152 & అబుదావూద్ 3 హదీస్ 5193, పేజి 874)***

అబుహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్తగారు ఇలా తెలిపారు : ఒక ముస్లింకు మరొక ముస్లింపై 5 హక్కులున్నాయి. 1) సలాంనకు ప్రతి సలాం చెప్పడం, 2) జబ్బు పడితే పరామర్శించడం 3) శవాన్ని సాగనంపడం (శవం వెంట వెళ్ళటం) 4) విందు ఆహ్వానాన్ని అంగీకరించడం 5) తుమ్ముకు సమాధానమివ్వడం. ***(బుఖారి 2, హదీస్ 1239, పేజి 319)***

## ఇక దివ్య ఖుర్ఆన్ వచనాలు చూద్దాం

వారు ప్రవేశించే శాశ్వత స్వర్గవనాలలో (చల్లటి) సెలయేర్లు ప్రవహిస్తూ ఉంటాయి. వారి కోరికలకు పూర్తి అనుగుణంగా అక్కడ సమస్త వస్తువులు లభిస్తాయి. దైవభీతిపరులకు దేవుడు ఇలాంటి ప్రతిఫలమే ప్రసాదిస్తాడు. దైవదూతలు వారి ఆత్మలను పవిత్రంగా ఉన్నప్పుడు స్వాధీనం చేసుకుంటూ **"మీకు (సలామ్) శాంతి కలుగుగాక!** మీరు చేసుకున్న (సత్) కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి" అని అంటారు.

***(ఖుర్ఆన్ 16వ సూర అన్ఆమ్ 31-32వ వాక్యం)***

మరో వాక్యలో ఇలా ఉంది. అప్పుడు స్వర్గపాలకులు వారిని సాదరంగా ఆహ్వానిస్తూ 'మీకు శాంతి (సలాం) సౌభాగ్యాలు కలుగు గాక! మీరు ఎంతో మంచివారు. ఇక శాశ్వతంగా ఇందులో ప్రవేశించి ఉండండి" అని అంటారు. ***(ఖుర్ఆన్ 39వ సూర జుమర్ 73వ వాక్యం)***

మరో వాక్యంలో ఇలా ఉంది. కారుణ్య ప్రభువు తరుపునుండి వారికి సలామ్ (శాంతి వచనం) చెప్పబడుతుంది.

***(ఖుర్ఆన్ 36వ సూర యాసీన్ 58వ వాక్యం)***

మరో వాక్యంలో ఇలా ఉంది. మీరు మీ ఇండ్లలో ప్రవేశించే ముందు ఇంట్లో ఉన్నవారికి **సలాం చేయండి.** ఇది దేవుడు నిర్ణయించిన ఆశీర్వాదం. ఎంతో శుభప్రదమైనది, పరిశుద్ధమైనది. మీరు విషయాన్ని గ్రహించడానికి దేవుడిలా మీ ముందు తన సూక్తులు వివరిస్తున్నాడు.

విశ్వాసులారా! మీరు మీ ఇండ్లలో తప్ప ఇతరుల ఇండ్లలోకి వారి అనుమతి లేకుండా, వారికి **సలాం చేయకుండా ప్రవేశించకండి.** ఇది మీకెంతో మంచి పద్ధతి. (ఖుర్ఆన్ 24వ సూర నూర్ 27వ వాక్యం)

ఇక హదీసులలో ఈ విధంగా ఉన్నాయి. మనం మార్గంగుండా పోవుచున్నప్పుడు చిన్న పిల్లలు ఎదురైతే వారికి కూడా సలాము చేయాలి.
***(బుఖారి 7, హదీస్ 6247 పేజి 570 & ముస్లిం & అబుదావుద్ 3, హదీస్ 5202)***

పరాయి స్త్రీ ఏకాంతముగా ఉన్నప్పుడు ముస్లింల పురుషుడు వారితో కలిసి ఉండరాదు. **(బుఖారి)**

స్త్రీల సమూహాముకు సలాము చేయవచ్చు

***(అబుదావూద్ 3, హదీస్ 5204 పేజి 878 & తిర్మిజి)***

అలాగే ఉత్తరాల్లో కూడా సలాము వ్రాయటం సదాచారం, సలాము నోటితో పలకాలి గానీ చేతి సైగలతోకాదు. కానీ ఎవరైనా దూరంగా ఉంటే, అతనికి వినబడదనుకుంటే సలాము నోటితో పలుకుతూ, చేత్తో సైగ చేయవచ్చు. మరొక విషయమేమిటంటే చిన్న వయస్కులు పెద్ద వయస్కులకు, చిన్న సమూహం పెద్ద సమూహానికి, వాహనంపై పోవువాడు నడుచువానికి; నడిచిపోవుచున్న వ్యక్తి కూర్చున్న వ్యక్తికి ముందుగా సలాము చేయాలి. మరియు దానికి జవాబుగా ప్రతి సలాము చేయాలి.

***(బుఖారి 7 హదీస్ 6231-6235 పేజి 563-564 & ముస్లిం 5 పేజి 354)***

ఇంకొక విషయమేమిటంటే ఏదైనా సభలో, సమావేశంలో ప్రవేశించినపుడు సలాము చేయాలి. అంతేకాకా ఆ సమావేశం నుండి వెడలునపుడు కూడా సలాము చేయాలి. కానీ సమావేశంలో ఎవరైనా ఒక ప్రత్యేక వ్యక్తికి కాకుండా అందరికీ కలిపి ఒకే సలాము చేయాలి. ఎవరైనా ప్రయాణం చేసి వెళ్తూ ఉంటే వాళ్ళచేత తన బంధుమిత్రుల కొరకు సలాము చేరవేయమని చెప్పి పంపించవచ్చు. ఇప్పుడొక ప్రవచనంలో చూద్దాం. అబుసైయిద్‌ఖుద్రి (రజి) ఉల్లేఖనం : ప్రవక్త ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్ వారు ఈ విధంగా తెలిపిరి. రహదారురపై కూర్చొనే పద్ధతిని మానుకోండి. అనుచరులు : మేము అచట కూర్చోడం తప్ప మరో దారిలేదే! అచటనే మేమంతా కలిసి మాట్లాడుకుంటుంటాం. దానిపై ప్రవక్త (స) ఈవిధంగా పలికిరి. ఒకవేళ అచటనే కూర్చోడం తప్పనిసరైనచో, దారి యొక్క హక్కు కూడా నెరవేర్చండి. అనుచరులు : దారి యొక్క హక్కు ఏమిటండి? ప్రవక్త సల్లెల్లాహు అలైహివ సల్లమ్ వారు ఈ విధంగా తెలిపిరి. తమ దృష్టిని (చూపులను) క్రిందకు ఉంచడం, ఎవరికైనా కష్టం కల్గించకుండా ఉండాలి. సలామ్‌నకు జవాబు పలకడం, మంచి మాటలు ఇతరులకు బోధించాలి. మరియు చెడు మాటల నుండి నివారించాలి.

***(బుఖారి 3, హదీస్ 2465 పేజి 585 & అబుదావుద్ 3 హదీస్ 4815 పేజి 713)***

ఇంకొక విషయమేమిటంటే ఎవరైనా "అస్సలాము అలైకుం" అని పలికి సలాము చేస్తే దానికి జవాబుగా సలాము పలుకుతూ మరికొన్ని ప్రార్ధనా పదాలు కలిపి పలికితే పుణ్యం కూడా ఎక్కువ లభిస్తుంది. ఈ పదాలు సలాము, ప్రతి సలాము రెంటిలో కూడా ఎక్కువ చేయవచ్చు. ఉదాహరణకు : "అస్సలాము అలైకుమ్ వరహ్మతుల్లాహీ వబరకాతుహు" దీనికి జవాబు "వ అలైకుమ్ అస్సలామ్ వరహ్మతుల్లాహీ వ బరకాతుహు."

అలాగే పరస్పరం కలిసినప్పుడు మొదట సలాములు పలికిన తర్వాత మాట్లాడటం ప్రారంభించాలి. ***(బుఖారి & ముస్లిం)***

ఒక గమనార్హ విషయం యేమిటంటే ముస్లింలు తమ తోటి ముస్లింల కొరకు సలాము చేయవచ్చుగానీ ముస్లిమేతరుల కొరకు సలాము చేయరాదు. వారి కొరకు వేరే పదాలు ఉపయోగించవచ్చు. లేదా సంజ్ఞ చేయవచ్చు గానీ వారి కొరకు "అస్సలాము అలైకుం" అను పదాలు ఉపయోగించరాదు. సత్య దైవప్రవక్త ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్ ముస్లిమేతర రాజ్యాధిపతులకు ఇస్లామీయ సందేశం పంపుతూ ఉత్తరం వ్రాయునపుడు సలాము కొరకు ఈ క్రింది పదాలు ఉపయోగించేవారు. "సలామున్ అలా మనిత్తబఅల్ హుదా" (అనగా ఎవరైతే సన్మార్గమును అనుసరింతురో వారికి శుభం కలుగుగాక). కానీ ఒకే సభలో ఉన్నప్పుడు సలాము పలకటం కోసం "అస్సలాము అలైకుమ్" అని పలకవచ్చు.

మరొక ముఖ్య విషయమేమిటంటే సలాము చేసిన తర్వాత కరచాలనం చేయాలి. కరచాలనం వలన సలాము ఆచారం పరిపూర్ణమవుతుంది. మరియు వారి పాపాలు సమసిపోతాయి.

సలాము తర్వాత కరచాలనం చేయువ్యక్తి తన కుడి చేత్తో కరచాలనం చేయాలి. ఎదుటి వ్యక్తి కూడా మన కుడి చేత్తోనే కరచాలనం స్వీకరించాలి. ***(బుఖారి & ముస్లిం)***

రెండు, రెండు చేతులతో కరచాలనం చేయరాదు

అదే విధంగా స్త్రీలు తమ తోటి స్త్రీలతో తారశపడిన లేక వారితో కలిసినా ముందుగా సలాము చేయాలి.

# ఏకదైవారాధనా విశ్వాసం

ఒక ముఖ్య ప్రశ్న : సర్వ మానవ జాతిని సృష్టించడానికి ముఖ్య కారణమేమి?

నేను మానవుల్ని జిన్నుల్ని నన్ను ఆరాధించడానికి తప్ప మరే లక్ష్యంతో పుట్టించలేదు. ***(ఖుర్‌ఆన్ 51వ సూర, జారియాత్ 56వ వాక్యం)***

పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఆరాధన అనే పదం పేర్కొన్న ప్రతీ చోట దాని అర్థం ఏకదైవారాధన అవుతుంది. దీనివల్ల వ్యక్తమయ్యేదేమిటంటే సర్వారాధనలు ఒక్క అల్లాహ్‌కు అంకితం చేయాలి. ఇదే విషయం ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది.

మీరు అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనకు (దైవత్వంలో) ఎవరినీ సాటి కల్పించకండి. తల్లిదండ్రుల పట్ల సద్వర్తనతో వ్యవహరించండి. బంధువులు, అనాధుల, నిరుపేదలతో మంచిగా మసులుకోండి. ఇరుగు పొరుగు బంధువులకు, పరిచయంలేని పొరుగువారికి, (మీ దైనందిన కార్యకలాపాలతో) తారసపడే మిత్రులకు, బాటసారులకు మీ ఆధీనంలో వున్న బానిసలకు మేలు చేయండి. దేవుడు అహంకార ప్రగల్భాలను పలికే వారిని ఎన్నటికి ప్రేమించడు. ***(ఖుర్‌ఆన్ 4వ సూర, నిసా 36వ వాక్యం)***

దైవప్రవక్తలందరి సందేశ సారాంశం కూడా ఇదే. మేము నూహ్‌ను అతని జాతి వద్దకు పంపాము. అతను ఇలా అన్నాడు. "నా జాతి సోదరులారా! అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక దేవుడు లేడు. ***(ఖుర్‌ఆన్ 7వ సూర, ఆరాఫ్ 59వ వాక్యం)***

మరియు ఖుర్‌ఆన్ గ్రంథములో ఈ వచనాలు చూడండి.

***(ఖుర్‌ఆన్ 21వ సూర, అంబియా 70-93 వ వాక్యం)***

సర్వ దైవప్రవక్తల నేత, సర్వలోక నాయకులు మరియు అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్ గారికి కూడా ఏక దైవారాధన సందేశమే ప్రసాదింపబడింది.

ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా ఉంది.

ముహమ్మద్! ఇలా ప్రకటించు మానవులారా! నేను మీ అందరి వైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి ఆయన భూమ్యాకాశాల సామ్రాజానికి ప్రభువు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆయనే మృత్యువును ఇస్తాడు. కనుక విశ్వసించండి అల్లాహ్‌ను ఆయన పంపిన నిరక్షరాస్యుడైన ప్రవక్తను అతను అల్లాహ్‌ను ఆయన సూక్తులను విశ్వసిస్తాడు. అతనినిన అనుసరించండి. మీరు సరైన మార్గం పొందుతారేమో. ***(ఖుర్‌ఆన్ 7వ సూర, ఆరాఫ్ 158వ వాక్యం)***

ఒక్క అల్లాహ్‌నే ఆరాధించాలి మరియు ప్రార్థించాలి. అన్నివిధాల ఆరాధనలో అల్లాహ్ కొరకే అంకితం చేయాలి గాని అందు వేరే ఎవరికి భాగం ఉంచరాదు.

ఏకదైవారధన కోసమే అల్లాహ్ సర్వ రాశులను సృజించెను. దాని ప్రచారం కోసమే తన ప్రవక్తలను ప్రభవింపజేసెను మరియు తన గ్రంధములను అవతరింపజేసెను. దానివలనే విశ్వాసుల మరియు అవిశ్వాసు మధ్య వ్యత్యాసం తెలియవస్తుంది. ఏక దైవారధకులు విశ్వాసులుగా పరిగణింపబడి స్వర్గర్హులు అవుతారు. బహుదైవారాధకులు అవిశ్వాసులుగా పరిగణింపబడి నరకవాసులు అవుతారు.

ఒకవైపు ఏకదైవారాధన వైపు ఆహ్వానిస్తూ బహుదైవారాధనను ఖండిస్తుంది. ఈ విషయం దివ్య ఖుర్‌ఆన్‌లో పలుచోట్ల తెలుపబడింది.

మరియమ్ కుమారుడైన మసీహ్‌యే అల్లా (దేవుడు) అని అన్నవారు నిశ్చయముగా అవిశ్వాసానికి పాల్పడినట్లే. వాస్తవానికి మసీహ్ ఇలా అన్నాడు. ఇస్రాయేలు వంశీయులారా! అల్లాహ్‌కు దాస్యం చేయండి. ఆయన నాకూ ప్రభువే మీకు ప్రభువే. ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవారికి అల్లా స్వర్గాన్ని నిషిద్ధం చేశాడు. వారి నివాసం నరకం. ఇటువంటి దుర్మార్గులకు సహాయం అందించేవారు ఎవరూ లేరు.

***(ఖుర్‌ఆన్ 5వ సూర, మాయిదా 72వ వాక్యం)***

ఆరాధనకు అరబ్బీపదం “ఇబాదత్”. ఇబాదత్ అంటే అత్యంత అణుకువ మరియు వినయం. ఇస్లామియా పరిభాషలో ఇబాదత్ అంటే అత్యంత ప్రేమ, వినయం, భక్తి కలిగి ఉండటం.

ప్రవక్త ప్రవచనం ప్రకారంగా ఆరాధన సంపూర్ణత చేకూర్చుడానికి ఈ విధంగా తెలిపిరి.

వాక్కుతోను, శరీరముతోను, ధనముతోను చేసిన పవిత్ర ప్రార్ధనలన్నియు కేవలం అల్లాహ్ కొరకే. ఓ ప్రవక్తా మీ పై శాంతి కలుగు గాక! మరియు మాపై మరియు దేవుని పవిత్ర భక్తులపై శాంతి కలుగుగాక అల్లాహ్ తప్ప వేరే పూజ్యులు లేరని నేను సాక్ష్యమిచ్చుచున్నాను. మరియు ముహమ్మద్ అల్లాహ్ యొక్క దాసుడు మరియు ప్రవక్త అని సాక్ష్యమిచ్చుచున్నాను. ***(బుఖారి 2 హదీస్ 831 పేజి 31)***

దీనిని ప్రతీ ముస్లిం ప్రతీ నమాజ్‌లో చదువుతూ ఉంటారు.

ఇక ఆరాధన యొక్క కొన్ని రకాలు తెలుసుకుందాం. పూజ, గౌరవ భావంతో వంగటం, సాష్టాంగ పడటం, ప్రదక్షిణ చేయటం, మొక్కుబడులు మొక్కుకోవటం, జంతువులు జిబాహ్ చేయటం శరణు వేడటం, నమ్ముకోవటం మొదలగు ఇవన్నీ ఆరాధన కోవకు చెందినవే. కానీ వీటన్నిటినీ అల్లాహ్ కొరకు మాత్రమే అంకితం చేయటము మనందరి కర్తవ్యం. ఈ విషయాన్ని వివరంగా తెలుసుకుందాం.

**1) గౌరవ భావంతో వంగటం (రుకు), సాష్టాంగ పడటం (సజద)**

అల్లాహ్ ఇలా బోధించెను. విశ్వాసులారా! రుకూ చేయండి. సజ్‌దా చెయ్యండి. మీ ప్రభువుకు దాస్యం చెయ్యండి. మంచి పనులు చెయ్యండి. దీని ద్వారానే మీకు సాఫల్య భాగ్యం లభిస్తుందని భావించవచ్చు ***(ఖుర్‌ఆన్ 22వ సూర, హజ్ 27వ వాక్యం)***

**2) నమాజ్ :** త్యాగము (బలి) అల్లాహ్ ఆదేశం. ఇలా అను "నా నమాజ్ నా సకల ఉపాసనారీతులు, నా జీవితం, నా మరణం సమస్తమూ సకల లోకాలకూ ప్రభువైన అల్లాహ్ కొరకే ఆయనకు ఏ భాగస్వామి లేడు. ఈ ఆజ్ఞయే నాకు ఇవ్వబడింది. అందరికంటే ముందు విధేయతతో తలవంచేవాణ్ణి. ***(ఖుర్‌ఆన్ 6వ సూర, అన్‌ఆమ్ 62-63 వ వాక్యం)***

దైవ ప్రవక్త ఇలా శపించారు : అల్లాహ్ తప్ప ఇతరుల పేర బలిచ్చు వానిని అల్లాహ్ శపించి నాశనం చేయుగాక. ***(ముస్లిం)***

**<u>3) మొక్కుబడులు, ప్రదిక్షణలు :</u>** దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా పేర్కొనబడింది. ముస్లింలు అల్లాహ్ పేర చేసిన మొక్కుబడులు పూర్తి చేయాలి. మరియు అల్లాహ్ యొక్క అతి ప్రాచీన గృహమైన కాబాకు ప్రదక్షణాలు చేయాలి.

***(ఖుర్‌ఆన్ 22వ సూర, హజ్ 29వ వాక్యం)***

అనగా అల్లాహ్ తప్ప ఇతరుల పేర మొక్కుబడులు చేయరాదు. పవిత్ర కాబా గృహం తప్ప వేరే ఏ వస్తువుకూ ప్రదిక్షణ చేయటం, ప్రతిమలకు, సమాధులకు ప్రదిక్షణలు చేయటం నిషేధం, మహాపాపం. అంతేకాక ప్రతిమల పేర, సమాధుల పేర ఆస్తులు వ్రాయటం, ఆ ఆస్తుల ఆదాయం వాని పేర వ్రాయటం కూడా మహా పాపకార్యమే. ఎవరైనా అల్లాహ్ తప్ప ఇతరుల పేర ఏదైనా మొక్కుకుని వుంటే ఆ మొక్కుబడిని పూర్తి చేయరాదు. అది పాపమని తెలిసిన వెంటనే అల్లాహ్ సమక్షాన క్షమాపణ వేడుకోవాలి. మరియు పవిత్ర వచనం "లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్రసూలుల్లాహ్" పఠించి, తన విశ్వాసం నిర్ధారణ చేసుకోవాలి. కానీ పాపకార్యమని తెలిసికూడా ఎవరైనా ఇతరుల పేర మొక్కుబడులు చేస్తే అతడు ఇస్లాం ధర్మం నుండి బహిష్కరింప బడినవాడవుతాడు.

**<u>4. ప్రమాణం చేయటం :</u>** దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లామ్ వారు ఈవిధంగా తెలిపారు. ఇబ్నెఉమర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త (స) మరియు ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) తో కొందరు రౌతులతో కలిసి వెళ్తూ మాటల సందర్భంలో తన తండ్రి పేరుతో ప్రమాణం చేస్తూ ఉ ండటం విన్నా. అప్పుడాయన ఉమర్ (రజి) ను ప్రవక్త (స) వారు ఈ విధంగా విన్నవించెను. "జాగ్రత్త! మీరు మీ తాతముత్తాతల మీద ప్రమాణం చేయకూడదని దేవుడు గట్టిగా తాఖీదు చేశాడు. అందువల్ల ఎవరైనా ప్రమాణం చేయదలచుకుంటే దేవుని పేరుతో మాత్రమే ప్రమాణం చేయాలి. లేకపోతే ఊరుకోవాలి అని అన్నారు.

***(బుఖారి 7, హదీస్ 6108 పేజి 487& అబుదావుద్ 3 హదీస్ 3249 పేజి 7)***

**<u>5. సహాయం వేడుకోవడం :</u>** ప్రతీ ముస్లిం ప్రతీ నమాజ్‌లో ఇలా వేడుకోవడం తప్పనిసరి. "మేము (అల్లాహ్) నిన్నే ఆరాధిస్తాము. సహాయం కొరకు నిన్నే అర్థిస్తాం. ***(ఖుర్ఆన్ 1వ సూర, ఫాతిహా 4వ వాక్యం)***

**<u>6. భయభక్తులు కలిగి ఉండటం :</u>** విశ్వాసుల ప్రతిఫలం వారిలో సజ్జనులు, భయభక్తులు కలవారు అయిన వ్యక్తుల కొరకు గొప్ప ప్రతిఫలం ఉంది.
***(ఖుర్ఆన్ 3వ సూర, అలి ఇమ్రాన్ 175వ వాక్యం)***

**<u>7. శరణం వేడుకోవడం :</u>** అల్లాహ్‌ను వదలి నీకు నష్టాన్ని గాని లాభాన్ని గాని కలిగించలేని ఏ శక్తినీ వేడుకోకు. ఒకవేళ అలాచేస్తే నీవు దుర్మార్గుడవై పోతావు. అల్లాహ్ కనుక నిన్ను ఏదైనా ఆపదకు గురిచేస్తే స్వయంగా ఆయన తప్ప ఆ ఆపదను తొలగించేవారు ఎవ్వరూ లేరు. నీ విషయంలో ఏదైనా మేలు చేయాలని సంకల్పిస్తే, ఆయన అనుగ్రహాన్ని మళ్ళించేవాడు కూడా ఎవ్వడూ లేడు ఆయన తన దాసులలో తాను కోరిన వారికి తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు. ఆయన క్షమించేవాడూ, కరుణించేవాడును."
***(ఖుర్ఆన్ 10వ సూర, యూనుస్ 106-107వ వాక్యం)***

అలాగే బహుదైవారాధనను ఖండించే మరో వాక్యాన్ని గమనించండి: దేవుడ్ని వదలి ప్రళయం దాకా తమ ప్రార్థనలకు స్పందించని మిథ్యాదైవాలను మొరపెట్టుకునే వాడి కంటే మించిన మార్గభ్రష్టుడు మరెవరుంటారు? పైగా మొరపెట్టుకునే వారు తమను మొర పెట్టుకుంటున్నారన్న సంగతి కూడా ఆ మిథ్యాదైవాలకు తెలియదే? అంతేకాదు, మానవులంతా సమావేశపరచబడే (ప్రళయ) దినాన వారు తమను ప్రార్థించిన వారికి శత్రువులయిపోతారు; వారి పూజా పురస్కా-రాలను తిరస్కరిస్తారు. (ఖుర్ఆన్ 46వ సూర, అహ్‌ఖాఫ్ 5-6వ వాక్యం)

కావున అల్లాహ్‌కాక యితరులు కూడా లాభనష్టాలు కలుగజేయ గలరని విశ్వసించేవాడు బహుదైవారాధకుడవుతాడు. అలాగే మృతులను, సమాధులలో పూడ్చబడేవారిని అర్థించేవాడు. భయభక్తులతో, నమ్మకంతో నిష్ట నివారణకై లేదా లాభార్జనకై వారిని ప్రార్థించేవాడు, వారి సహాయంతో సంతానం కోరేవాడు కూడా బహుదైవోపాసకుడవుతాడు. సజీవులు నిర్జీవులను వేడుకోవటం అజ్ఞానం అవుతుంది. సమాధుల్లోను మృతులు

ఏమీ వినలేరని వారిని పూజించటం చెవిటివాని ముందు శంఖ ఊదినట్లే నని చచ్చినవారు బ్రతుకువారు సమానులు కాలేరు. దివ్య ఖుర్ఆన్‌లో పలుమార్లు పేర్కొనబడింది.

ఈ వచనాలు చూడండి. ***(30:52, 35:22, 27:80-81)***

## బహుదైవారాధన

అల్లాహ్‌ను ఆరాధించే ప్రత్యేక విషయంలో ఇతరులకు భాగం కల్పించటం లేక సాటి కల్పించడం దీనిని బహుదైవారాధన అనబడుతుంది. ఉదా : సాష్టాంగం, జంతుబలి, మొక్కుబడి (నియాజ్) ఇవన్నీ షిర్క్ అనబడును. వీటి గూర్చి ఖుర్ఆన్ వాక్యాలు చూడండి. అల్లాహ్ దృష్టిలో కేవలం షిర్క్ ఒక్కటే క్షమార్హం కానిది. అది తప్ప తాను కోరిన వారి అన్ని పాపాలను ఆయన క్షమిస్తాడు. ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసినవాడు అపమార్గాన బహుదూరం వెళ్ళిపోయాడు. వారు అల్లాహ్‌ను వదలి స్త్రీ దేవతలను ఆరాధ్యులుగా చేసుకుంటారు. అల్లాహ్ శాపానికి గురైన ఆ తిరుగుబాటుదారు షైతాన్‌ను తమ ఆరాధ్యుడుగా చేసుకుంటారు.

***(ఖుర్ఆన్ 4వ సూర, నిసా 116-117వ వాక్యం)***

దేవునికి (ఆయన దైవత్వంలో) ఎవరినీ సాటి కల్పించకు. సృష్టికర్తకు సాటి కల్పించడం ఘోరమైన పాపం, దారుణమైన అన్యాయం.

***(ఖుర్ఆన్ 31వ సూర, లుఖ్మాన్ 13వ వాక్యం)***

ఈ ప్రజలు అల్లాహ్‌ను కాదని తమకు నష్టాన్ని గానీ, లాభాన్ని గానీ కలిగించలేనివారిని పూజిస్తున్నారు. పైగా ఇలా అంటున్నారు. "వారు అల్లాహ్ వద్ద మా కొరకు సిఫారసు చేస్తారు" ప్రవక్తా! వారితో ఇలా అను "ఆకాశాలలో గానీ, భూమిలోగానీ అల్లాహ్ ఎరుగని విషయాన్ని గురించి ఆయనకు మీరు తెలుపుతున్నారా?" ఆయన పరిశుద్ధుడు. ఈ ప్రజలు చేసే షిర్కుకు అతీతుడూ, ఉన్నతుడూను.

***(ఖుర్ఆన్ 10వ సూర, యూనుస్ 18వ వాక్యం)***

అయితే ఈ తిరస్కారులు, నన్ను కాదని, నా దాసులను తమ కార్యసాధకులుగా చేసుకునే తలంపు కలిగి ఉన్నారా? అటువంటి

అవిశ్వాసులకు ఆతిథ్యంగా మేము నరకాన్ని సిద్ధం చేసి ఉంచాము.

***(ఖుర్ఆన్ 18వ సూర, కహఫ్ 102వ వాక్యం)***

మానవులారా! ఒక ఉదాహరణ ఇవ్వబడుతోంది. దానిని శ్రద్ధగా వినండి. అల్లాహ్‌ను కాదని మీరు ఏ దేవుళ్ళను వేడుకుంటున్నారో, వారందరూ కలిసి సమైక్యంగా ఒక్క ఈగను సృష్టించదలచినా, అలా చేయలేరు. అంతేకాదు, ఒకవేళ ఈగ వారి నుండి ఏదైనా వస్తువును లాక్కుపోయినా, వారు దానిని విడిపించుకు రానూలేరు. సహాయాన్ని అర్థించినవారూ బలహీనులే, సహాయం కోసం అర్థింపబడేవారూ బలహీనులే. అల్లాహ్ గొప్పతనాన్నే వారు గుర్తించవలసిన విధంగా గుర్తించలేదు. నిజానికి అల్లాహ్ మాత్రమే శక్తిమంతుడు, గౌరవనీయుడును.

***(ఖుర్ఆన్ 22వ సూర, హజ్ 73-74వ వాక్యం)***

వారితో ఇలా అను, "ఆకాశాలలోనూ, భూమిలోనూ అల్లాహ్ తప్ప అగోచర జ్ఞానం కలవాడు మరెవ్వడూ లేడు. వారికి (మీ దేవుళ్ళకు) తాము ఎప్పుడు లేపబడతారో కూడా తెలియదు కదా!

***(ఖుర్ఆన్ 27వ సూర, నమల్ 65వ వాక్యం)***

"ప్రవక్తా! వారితో ఇలా అను : "నాకు సంబంధించిన లాభనష్టాలపై నాకు ఏ అధికారమూ లేదు. అల్లాహ్ కోరింది మాత్రమే అవుతుంది. నాకే గనుక అగోచర విషయ జ్ఞానం ఉన్నట్లయితే, నేను ఎన్నో ప్రయోజనాలను నా కొరకు పొంది ఉండేవాణ్ణి. నాకు ఎన్నటికి ఏ నష్టమూ వాటిల్లేది కాదు. నేను నా మాటను నమ్మేవారి కొరకు కేవలం హెచ్చరిక చేసేవాణ్ణి మాత్రమే. శుభవార్త వినిపించేవాణ్ణి మాత్రమే."

***(ఖుర్ఆన్ 7వ సూర, ఆరాఫ్ 188వ వాక్యం)***

ప్రవక్తా! వారితో ఇలా అను : నా వద్దకు వచ్చిన (వహీ) దైవాజ్ఞతో తినవేవాడికొరకు ఏ వస్తువూ నిషేధించబడినట్లు నాకు కనిపించదు. చచ్చిన జంతువు, కారిన రక్తము, పంది మాంసము, ఇది అపరిశుద్ధం గనక, లేక ఫిస్ఖ్ (అపచారం), అంటే, అల్లాహ్ పేరుతోకాక వేరేవారి పేరుతో జిబహ్ చెయ్యబడింది. ***(ఖుర్ఆన్ 6వ సూర, అన్ఆమ్ 145వ వాక్యం)***

విశ్వసించిన ప్రజలారా! నిజంగానే మీరు అల్లాహ్ ఆరాధకులు అయితే, మేము మీకు ప్రసాదించిన పరిశుభ్రమైన వస్తువులను నిస్సంకోచంగా

తినండి. అల్లాహ్‌ను కృతజ్ఞతలు తెలపండి. అల్లాహ్ నిషేధించినవి ఏమన్నా ఉంటే అవి ఇవి మాత్రమే. మరణించిన వాటిని తినకండి. రక్తాన్ని, పంది మాంసాన్ని ముట్టకండి. ఇంకా అల్లాహ్‌కు కాక ఇతరులను సమర్పించబడిన దానిని తినకండి. కాని ఎవరైనా గత్యంతరం లేక వాటిలోని ఏ పదార్థాన్నయినా తింటే అది పాపం కాదు. అయితే నిషేదాజ్ఞను ఉల్లంఘించే ఉద్దేశ్యం ఉండకూడదు. ఇంకా అవసరానికి మించి తినకూడదు. అల్లాహ్ క్షమించేవాడూ, కరుణించేవాడూను.

*(ఖుర్ఆన్ 2వ సూర, బఖర 172-173వ వాక్యం)*

మీకు ఇవి నిషేధించబడినాయి – మృత పశువు, రక్తము, పంది మాంసము, అల్లాహ్ పేరుతోకాక మరెవరి పేరుతోనైనా 'జిబహ్' చేయబడిన పశువు, ఊపిరాడక లేక దెబ్బతిని, ఎత్తు ప్రదేశం నుండి పడి లేక దేన్నయినా ఢీకొని లేక అడవి మృగం చీల్చగా మరణించిన జంతువు – సజీవంగా ఉండి మీరు 'జిబహ్' చేసినది తప్ప – బలిపీఠంపై వధింపబడినది. ఇంకా పాచికలద్వారా అదృష్టం తెలుసుకోవటం కూడా మీకు నిషేధించబడింది. ఇవన్నీ పాపకార్యాలు. (ఖుర్ఆన్ 5వ సూర, మాయిదా 3వ వాక్యం)

ప్రియ చదవరులారా! అల్లాహ్ తప్ప ఇతరుల పేర ప్రత్యేకించబడిన జంతువు వస్తువు ఏదైనా సరే నిషేధం. దాన్ని తినటం మహాపాపం. ఇటువంటి దురాచారం కొందరు నామ మాత్రపు ముస్లింలలో కూడా కానవస్తుంది. అది వివిధ రూపాల్లో కానవస్తుంది. ఉదాహరణకు : షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జిలాని గారి నియాజ్ (గ్యార్విం). సయ్యద్ అహ్మద్ కబీరు గారి గోవు, షేక్ సద్దోపేరిట మేకపోతు, ఇమాంహుసైన్ గారి పేరిట పానకం, పరమాన్నం, బీబీ ఫాతిమా పేరిట సహ్నక్, షేక్ అబ్దుల్ గారి పేరిట చక్కెర, ఇవన్నీ అల్లాహ్ తప్ప ఇతరుల పేర అంకితం చేయబడినవి. కాబట్టి వాటిని తినటం, త్రాగటం నిషేధం మరియు వారి వారి సమాధుల దగ్గర స్త్రీ, పురుషులు కలిసి రుకు సజ్దా (సాష్టాంగం పడటం) ప్రసాదం (తబర్రుక్), ఫాతిహా చేయడం నిషేధం. సామాన్యంగా బహుదైవారాధన రెండు విధాలుగా కానవస్తుంది.

1) కొందరు వ్యక్తులపేరు విగ్రహాలు, ప్రతిమలు తయారుచేసి వాటిని పూజించటం 2) కొందరు వ్యక్తుల పేర సమాధులు యేదైనా ప్రదేశాన్ని

వృక్షాన్ని, రాయిని కర్రను మరియు అలములను, తాజియాలను నియమించుకొని వాటిని పూజించటం, ఈ రెండు రకాల పనులూ పాపకార్యాలే కాబట్టి ఇస్లాం వాటిని నిషేధించింది.

ఒక చేదు వాస్తవమేమిటంటే కొందరు ముస్లింలు తమ అజ్ఞానము వల్ల ముస్లిమేతరులకు తీసుపోని విధంగా తయారయ్యారు. తాము ముస్లిం అని చెప్పుకుంటూనే అల్లాహ్‌ను విడిచి సమాధులను, వలీలను, బాబాలను పూజిస్తున్నారు. లాభనష్టాలు, సుఖదుఃఖాలు వారి చేతిలోనే ఉన్నాయని భావిస్తున్నారు. దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లెలాహు అలైహివ సల్లమ్ మానవుడు కాదని, దేవుని భాగం (నూర్) అవతారమని అపార్థపడు చున్నారు. ఈయన తర్వాత కూడా ఒక ప్రవక్త వచ్చారని భావించి మార్గం తప్పారు. మరి కొంతమంది. జంతువులను అల్లాహ్ పేరుకాక సమాధులలో ఉన్న వారి పేరున బలియిస్తున్నారు. నమాజ్ ఆరాధనను అల్లాహ్ కొరకు అంకితం చేయక అబ్దుల్ ఖాదర్ జిలానీ కొరకు సలాతే గౌసియా అని భాగం ఇస్తున్నారు. సమాధులకు ప్రదిక్షణలు చేస్తే హజ్ చేసినంత పుణ్యం దొరికిందని, ఇక స్వర్గప్రవేశం తప్పక లభిస్తుందని సంబరపడుతున్నారు. ఇవన్నీ నామమాత్రపు ముస్లింలు ఏర్పరచుకున్న బూటకపు దురాచారాలే గాని, వాటికి ఇస్లాంనకు ఎటువంటి సంబంధం లేదు. వాస్తవ బోధనలకు దూరం కావటం వల్లనే ఇలా జరుగుతోంది. కొన్ని విషయాలను ఈ క్రింది పొందు పర్చుచున్నాము. వీటిని గమనించండి. మరియు 27 - 28వ పేజిలో గల ఖుర్ఆన్ వాక్యాలను పరిశీలించండి.

## ఏమైనా వ్యత్యాసం ఉందా?

| | హిందూ మతాచారాలు | ముస్లిం దురాచారాలు |
|---|---|---|
| 1. | మందిరం | దర్‌గాహ్ |
| 2. | గోపురము | గుంబత్ |
| 3. | విగ్రహారాధికులు | సమాధి పూజారులు |
| 4. | పూజారి | ముజావర్ |
| 5. | అర్పణ | ఫాతెహా |
| 6. | ప్రసాదం | తబరుక్ |

| | | |
|---|---|---|
| 7. | దర్శనం | జియారత్ |
| 8. | ప్రణామ్ | అదాబ్ అర్సే |
| 9. | సాస్టాంగము | సజదా |
| 10. | ప్రదక్షణం | తవాఫ్ |
| 11. | భజన | ఖవ్వాలి |
| 12. | సంబరం | ఉరుస్ |
| 13. | మొక్కుబడి | నియాజ్ |
| 14. | నైవేద్యం | చఢావా |
| 15. | దశమి | దస్‌కన్ |
| 16. | రథయాత్ర | గమ్మటం యాత్ర |
| 17. | తీర్థయాత్రలు | జియారత్‌గాహ్ |
| 18. | మహాపురుషులు | బుజురుగ్‌లు (వలీలు, బాబాలు) |
| 19. | చందనోత్సవాలు | సందల్‌చఢానా |
| 20. | అగ్నియాత్ర | ఫూల్ ఖుందల్‌నా |
| 21. | అనకాపల్లి నూకాలమ్మ | పిఠాపురం బషీరమ్మ |
| 22. | కొబ్బరికాయలు | మిఠాయి పొట్లాలు |
| 23. | కర్రబొమ్మలు గుడిలో | ఇత్తడి ముక్కలు ఆస్తానాలో |
| 24. | తద్దినం (పిండాకూడు) | చెహులుమ్ (బర్‌సీ) (పిండాకూడు) |
| 25. | నిలుప రాళ్ళు మందిరాలలో | పరుండిన రాళ్ళు సమాధిపై |
| 26. | కార్తీక వారం | ఆఖరీ చాషుంబా |
| 27. | గణపతి నీళ్ళు ముంచి గోవిందా గోవిందా | పీర్లను కర్‌బలాలో ముంచి అల్‌విదా అల్‌విదా |
| 28. | దుర్గాదేవిన పోతు దసరా | జిలాని పేరున పోతు గ్యారవీం |
| 29. | ఆషాడ కొత్త దంపతులు వేర్వేరు | మొహర్రం కొత్త దంపతులు వేర్వేరు |
| 30. | కొంతమంది ఆపదలలో స్వామియే శరణం అయ్యప్ప | కొంతమంది అల్‌మదద్‌యా గౌస్, యాఖాజా |

పై రెండు పనులు ఒక్కటేగాని పేర్లు మార్చబడి పూజలు జరుగుతున్నవి. వీటిని ఆచరించేవారు ముస్లిములేనా? మరియు వీటిని ప్రోత్సహించే ఇమామ్‌లు నమాజ్ చదివించుటకు అర్హులేనా? వీరి వెనుక నమాజ్ అవుతుందా? అల్లాహ్ ఖురాన్‌షరీఫ్‌లో కాబతుల్లా (అల్లాహ్ ఇల్లు) ఒక్కటే అని ఆజ్ఞాపించుచున్నాడు. ఈనాటి అమాయక ముస్లింలు ప్రతీ ఇంటికి, ప్రతీ వీధికి, ప్రతి ఊరికి ఒక కాబతుల్లాగా మార్చుకున్నారు. ఎవరో తెలియని వ్యక్తి లేక పిచ్చివాడు లేక నగ్నంగా వున్నవానికి చచ్చిన తరువాత వలిఅల్లా, బాబా అని ఇలా సమాధులు కట్టి దానినే కాబతుల్లా కంటే అధిక ప్రాధాన్యత ఇచ్చి అల్లాహ్ కాబతుల్లావద్ద ఎలా చేయమన్నాడో అదే విధంగా సమాధికి పూజలు చేసుకుంటున్నారు. కాబతుల్లకు సమాధికి వ్యత్యాసం లేకుండా చేసారు ఈ దొంగ మౌల్వీలు. ప్రతీ సమాధికి నకిలి కాబాలుగా మార్చుకున్నారు. సమాధిలో ఉన్నవారికి పూజిసై చివరి దినాన్న సమాధి వాళ్ళే తిరస్కరిస్తారు. ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఆజ్ఞ సూర. యూనుస్ వాక్యం 28, 29 అర్థం : వారందరిని మేము ఒకేసారి సమావేశ పరచినపుడు దేవునికి సాటి కల్పించిన వారితో "ఆగండి మీరు దేవునికి మీరు సాటి కల్పించిన మీ మిద్యా దైవాలు అంటూ వారిని మేము నిలదీస్తాము. తరువాత వారు భయులు మధ్య ఉన్న అపరిచిత తెరని తొలగిస్తాము. అప్పుడు వారు కల్పించుకున్న మిద్యా దైవాలు వారితో (ఇలా అంటారు) మీరు మమ్మల్ని ఎన్నడూ ఆరాధించలేదు. ఈ విషయంలో మనకు దేవుడే సాక్షి (ఒకవేళ మీరు మమ్ముల్ని ఎప్పుడైనా ఆరాధించి ఉంటే) మీ ఆరాధన గురించి మాకు అసలు తెలియనే తెలియదు అని అంటారు. మరి కొంతమంది ఛిల్లాలు ఛట్టీలు అనుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా షిర్క్ మరియు బిద్‌ఆత్ ప్రచారాలు చేస్తూ ముష్తీలుగా తిరుగు తున్నారు. వాస్తవంగా తబ్లిగ్ అనగా దేవుని ఏకత్వం మరియు ప్రవక్త ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివసల్లం సాంప్రదాయ (సున్నత్) ను సర్వ మానవులకు చెప్పడం మాని ఎక్కడ మసీదులు ఉంటే అచటనే మకాం వేసి ఇమాములు పద్ధతి మరియు బుజురు గోంనే ఫర్మాయా అంటూ తబ్లిగ్ చేస్తారు. కాని ఖుర్‌ఆన్‌లో ఈవిధంగా ఉంది. తమ పండితులను, సన్యాసులను తమ ప్రభువులుగా చేసుకున్నారు. ***(ఖుర్‌ఆన్ 9వ సూర, తౌబా 30వ వాక్యం)***

ఖుర్ఆన్‌లో మరోచోట ఈ విధంగా ఉంది. మంచిని బోధిస్తారు. చెడుని ఆపుతారు. (ఖుర్ఆన్ 3వ సూర, అల్ ఇమ్రాన్ 110వ వాక్యం)

కానీ మీరు మంచి చెడులను కలగాపులగం చేసి తబ్లిగ్ చేస్తారు. ఉదా : ఇమాముల్ అంబియా పద్ధతిమాని ఇమామ్ అబుహనీఫా (హనఫీ) పద్ధతి వడ్డీని ధర్మసమ్మతం అని ఫతవాయిస్తారు. తలాక్ తలాక్ తలాక్ అనినచో తలాక్ అయిపోయిందని ఫతవా యిస్తారు. 40 రోజులు, సంవత్సరం పిండాకూడు వీటిలో సైతం పాల్గొంటారు. దు"ఆ" చేసేటప్పుడు ముహమ్మద్ (స) గారి తుఫైల్ తో దు"ఆ" అంగీకరించు అని దు"ఆ" చేస్తారు. ఇది సరైన పద్ధతి కాదు. వీరికి మా విన్నపం ఏమనగా తబ్లీద్‌ను వదలి ఖుర్ఆన్ మరియు హదీసుల ప్రకారంగా నడవడికను మరల్చు కొనవలసిందిగా కోరుచున్నాము.

| | **కాబ (అల్లాహ్ ఇల్లు వద్ద (చేయవలసినవి)** | **సమాధి వద్ద నిషేధము (చేయరానివి)** |
|---|---|---|
| **1.** | **కాబ వద్ద ప్రతీ సంవత్సరం హజ్** | **సమాధి వద్ద ప్రతీ సంవత్సరం ఉరుస్** |
| **2.** | **కాబకు ప్రదిక్షణం** | **సమాధికి ప్రదక్షణం** |
| **3.** | **కాబకు గిలాఫ్** | **సమాధికి గిలఫ్** |
| **4.** | **కాబ గిలఫ్ పట్టుకొని దు"ఆ"** | **సమాధి గిలఫ్ పట్టుకొని దు"ఆ"** |
| **5.** | **కాబ హజారే అస్నద్ కో చూమ్‌నా** | **సమాధి చూమ్‌నా** |
| **6.** | **కాబముఖాయే ఇబ్రాహీం వద్ద నమాజ్** | **సమాధి వద్ద నమాజ్** |
| **7.** | **కాబవద్ద దువాలు** | **సమాధి వద్ద దువాలు** |
| **8.** | **కాబ రుకున్ యమాని కౌగిలి** | **సమాధికి కౌగిలి** |
| **9.** | **కాబ హరమ్, మర్యాదచోటు** | **సమాధి హరమ్ కన్నా ఎక్కువ తిరిగి వెనక్కి రాకూడదు.** |
| **10.** | **కాబ ముల్‌తజిమ్** | **సమాధిని కౌగిలి (చిమట్‌నా)** |
| **11.** | **కాబ సయి, సఫా మర్వా పరుగు** | **సమాధివద్ద నుండి బాబా చిల్లా చోటు వరకు పరుగు** |
| **12.** | **కాబ వద్ద హదీ (ఖుర్బాని చేయాలి)** | **సమాధి వద్ద నియజ్‌క బకరా (ఖుర్బాని చేయాలి)** |

| | | |
|---|---|---|
| **13.** | **కాబ జమ్‌జమ్ (నీరు)** | **సమాధి చందనం, మిఠాయి తబరుక్ (షర్బత్)** |
| **14.** | **కాబవద్ద హలఖ్, గుండు గీయించుట** | **సమాధి వద్ద గుండు గీయించుట** |
| **15.** | **కాబ వెళ్ళేటప్పుడు లబ్బయిక్ అల్లాహుమ్మ లబ్బయిక్** | **సమాధికి వెళ్ళేటప్పుడు యాగౌస్ యఖాజా** |

పై చెప్పబడిన పనులు ఎంత విచిత్రంగా ఉన్నాయో మీరే గమనించారు కదా! ఇది ఎలా వచ్చిందంటే మా తాతగారు చేస్తూ, మా నాన్న, మా అమ్మ వారు చేసేవారు అందుకే మేము చేస్తున్నాము అంటారు. ఒక్కసారి జ్ఞాననేత్రాలను తెరవండి. ఇది అమాయకత్వం, ముఢత్వం కాకపోతే మరేమిటి. వీటినుండి ఇకనైన దూరంగా ఉండి అల్లాహ్‌తో క్షమాభిక్ష వేడండి. ఖుర్ఆన్ మరియు హదీసు వైపునకు మరలండి. అల్లాహ్ తప్పనిసరిగా క్షమిస్తాడు. సన్మార్గం చూపుతాడు.

## విచారణ దిన సిఫారసు వివరాలు

ఈ లోకంలో సిఫారసు రెండు విధాలుగా కానవస్తుంది. 1) హోదా సిఫారసు, అనగా రాజు తన ఆస్థానంలోని హోదాగల వ్యక్తి మాట విని హోదాకు గౌరవంగా యేదైనా నేరస్థుడిని క్షమించి, విడిచిపెట్టడం 2) ప్రేమ సిఫారుసు, అనగా రాజు తనకు ప్రియమైన వ్యక్తి మాటవిని తన ప్రేమకు భంగం కలుగకుండా ఎవరైనా నేరస్థుడిని క్షమించి విడిచి పెట్టడం, ఇటువంటి సిపారసులు ఇహలోకంలో జరుగుతాయి. కానీ అల్లాహ్ సమక్షాన ఇలా జరుగుతుందని భావించటం మహాపాపం. కానీ అల్లాహ్ సమక్షాన జరిగే సిఫారసు అనుమతి లేకుండా ఎవరూ సిఫారసు చేయబడరు. అల్లాహ్ అనుమతి కాకుండా ఎవరి సిఫారసు చెల్లనేరదు. అంతిమ దినాన అల్లాహ్ తన ప్రవక్తలకు మరియు సజ్జన దాసులకు సిఫారసు చేయ అనుమతినిచ్చును. అల్లాహ్ ఎవరికి సిఫారసు కొరకు అనుమతించునో ఆ అనుమతి మేరకు వారి కొరకు సిఫారసు చేయుదురు.

దివ్య ఖుర్ఆన్‌లో దేవుని హెచ్చరికను చూడండి ఓ ప్రవక్తా! ఇలా ప్రకటించుము. ఓ బహుదైవారాధకులారా! మీరు అల్లాహ్‌ను విడిచి వేరే

ఎవరినైతే ఆరాధ్యులుగా ఎంచుకున్నారో వారిని ప్రార్థించి చూడండి (అనగా మీరెంత ప్రార్థించి మొత్తుకున్నా వ్యర్థమే). ఆ తప్పుడు ఆరాధ్యులకు భూమ్యాకాశాల్లో ఒక్క రేణువంతి భాగస్వామ్యమూ లేదు. వారు దేవునికి సహకారులూ కాదు. అంతేకాక అల్లాహ్ యెవరి కొరకైతే సిఫారసు చేయు అనుమతించునో వారి కొరకు తప్ప వేరే ఎవరి కొరకూ, ఎవరి సిఫారసు చెల్లనేరదు. ***(ఖుర్ఆన్ 34వ సూర, సబా 22-23వ వాక్యం)***

ప్రళయదినాన సిఫారసు పొందడానికి రెండు నిబంధనలు తప్పనిసరి. 1) ఒకే ఒక దేవుడైన అల్లాహ్‌ను ఆరాధించడం 2) దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లెల్లాహు అలైహివ సల్లమ్ గారి అడుగుజాడల్లో నడవటం.

ఈ విషయాన్ని దైవ ప్రవక్త గారు ఇలా వివరించారు. ఎవరైతే సంకల్ప శుద్ధితో పవిత్ర వచనాన్ని లాఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్ర సూలుల్లాహ్ "పఠించునో (అనగా దాని పఠించి, దాని యందు విశ్వాసం ఉంచి, దాని వల్ల ఉత్పన్నమయ్యే ఆదేశాల ప్రకారం ఎవరైతే ఆచరించునో) వారికి నా సిఫారసు తప్పక లభించును (బుఖారి1 హదీస్ 99 పేజి 270) కానీ బహు దైవారాధకులకు, కపటులకు సిఫారసు ఎన్నటికీ లభించజాలదు. ***(ముస్లిం)***

ఓ అల్లాహ్! మనందర్ని నీ ప్రవక్త సిఫారసు ప్రసాదించుము. ఆమీన్! సుమ్మ ఆమీన్...

## ఇస్లాం విశిష్టతలు

1) ఇస్లాం ధర్మం ప్రతీరంగంలో జ్ఞాన మేధాశక్తులకు అనుగుణంగా పయనిస్తుంది. 2) ఇస్లాం ధర్మ నాగరికతా ప్రగతుల మార్గానికి ఆహ్వానిస్తుంది. 3) ఇస్లాం ధర్మంలోనే ఆధ్యాత్మిక, భౌతిక విషయాలు ఇమిడి ఉన్నాయి. 4) ఇస్లాం ఒక్కటే సత్య ధర్మమని నేటి ఆధునిక ప్రపంచం కూడా సాక్ష్యమిస్తుంది. 5) ఇస్లాం ధర్మ సత్య ధర్మమని పరిశోధనం ద్వారా నిరూపించటం అతి సులభం. 6) ఇస్లాం ధర్మం ఒక్కటే సర్వ దైవ ప్రవక్తల యందు మరియు సర్వ దైవ గ్రంథముల యందు విశ్వాసముంచటం తప్పనిసరిగా పేర్కొంటుంది. 7) ఇస్లాం ధర్మంలో మాత్రమే సర్వమానవాళి యొక్క సర్వ జీవిత సమస్యలకు

పరిష్కారం ఉంది. 8) ఇస్లాం ధర్మం సత్య ధర్మమని ఆధునిక శాస్త్రాలు కూడా సాక్ష్యమిస్తున్నాయి. 9) ఇస్లాం ధర్మంలో మాత్రమే సౌలభ్యం మరియు చక్కదనం ఉంది. 10) ఇస్లాం ధర్మం మాత్రమే ప్రతీ ప్రాంత వాసులకు, ప్రతీ కాలము వారికి అతి అనుకూలమైనది. 11) ఇస్లాం ధర్మం ప్రకారం ఆచరించుటం ప్రతీ స్థితిలోనూ అతి సులభం. 12) ఇస్లాం ధర్మం ఒక్కటే అతిమితాలకు అతీతంగా మధ్యస్థంగా ఉంటుంది. 13) ఇస్లాం ధర్మం యొక్క దైవగ్రంథం మాత్రమే (అనగా దివ్య ఖుర్ ఆన్) అతి భద్రంగా ఉంది. 14) ఇస్లాం ధర్మం యొక్క దివ్య గ్రంథం మాత్రమే ప్రయోజిక విద్యలనభ్యసించే అనుమతి నిస్తుంది. 16) ఇస్లాం ధర్మం ఒక్కటే నేటి ఆధునిక ప్రగతివల్ల ప్రయోజనం పొందుతుంది. 17) ఇస్లాం ధర్మంలో మాత్రమే ఆధునిక నాగరికతలోని పొరపాట్లకు సరియైన దిద్దుబాటు కలదు. 18) ఇస్లాం ధర్మంలో మాత్రమే నాగరికత యొక్క భౌతికతా ఆధ్యాత్మికతలు ఇమిడి ఉన్నాయని చరిత్ర చాటి చెబుతుంది. 19) ఇస్లాం ధర్మం ద్వారానే ఈ లోకంలో శాంతి స్థాపన కాగలదు. 20) ఇస్లాం ధర్మ సత్యాన్ని జ్ఞాన విశ్లేషణ ద్వారా అతి సులభం 21) ఇస్లాం ధర్మం మాత్రమే మానవ సమాజంలోని వివిధ వ్యత్యాసాలను నిర్మూలించింది. 22) ఇస్లాం ధర్మం ఒక్కటే సర్వ మానవాళికి ఒకే మానవత్వచట్టం ఉండాలని ప్రకటించింది. 23) ఇస్లాం ధర్మం మాత్రమే సాంఘిక సమానత్వాన్ని స్థాపించింది. 24) ఇస్లాం ధర్మంలో మాత్రమే రాజ్యపాలకుల దౌర్జన్య నియంత్రత్వాలను రూపుమాపి పరస్పర సలహాల విధానాన్ని రూపొందించింది. 26) ఇస్లాం ధర్మం మాత్రమే శత్రువుల పట్ల కూడా న్యాయంగా వ్యవహరించాలని బోధించింది. 27) ఇస్లాం ధర్మం గురించియే సర్వదైవ గ్రంథముల యందు శుభవార్త కలదు. 28) ఇస్లాం ధర్మం మాత్రమే స్త్రీల హక్కులను కాపాడి వారికి భద్రతా రక్షణలు ఏర్పరచింది. 29) ఇస్లాం ధర్మం మాత్రమే వివిధ రంగుల, వివిధ జాతుల, వివిధ ప్రాంతవాసుల మధ్య సమానత్వం నెలకొల్పింది. 30) ఇస్లాం ధర్మం మాత్రమే ధార్మిక విద్యాభ్యాసం కొరకు ప్రోత్సహించి, ప్రయోజనకర విజ్ఞానాన్ని దాచి

పెట్టడానికి నిషేదపర్చింది. 31) ఇస్లాం ధర్మం యొక్క ఆదేశాలు ధర్మం మాత్రమే బుద్ధి బలం మరియు మేధాశక్తి యొక్క ఔనత్యాన్ని మరియు దాని నిర్ణయాత్మక శక్తిని నిరూపించింది. 32) ఇస్లాం ధర్మం మాత్రమే ధనికులు దాన ధర్మాలు చేయాలని ప్రోత్సహించి ఒకవైపు ధనికులకు మరొకవైపు పేదవారిని కాపాడింది. 33) ఇస్లాం ధర్మం మాత్రమే ప్రకృతి ధర్మం మరియు దైవప్రసాదిత వివేకం ప్రకారం సద్గుణాల కాఠిన్య లాలిత్యాల స్థానాన్ని ధృవపర్చింది. 34) ఇస్లాం ధర్మం మాత్రమే సర్వ సృష్టి రాశుల పట్ల దయాదాక్షిణ్యాలతో ప్రవర్తించాలని ఆదేశించింది. 35) ఇస్లాం ధర్మం మాత్రమే ప్రకృతి నియమాలకు అనుగుణంగా నాగరిక హక్కులు నియమాలు బోధించింది. 36) ఇస్లాం ధర్మం మాత్రమే మానవుల ఆరోగ్యాన్ని మరియు సంపదను కాపాడింది. 37) ఇస్లాం ధర్మం మాత్రమే మానవుని మనసును, మేధస్సు, ప్రవర్తనను ప్రభావితపర్చి సరిచేసింది. 38) ఇస్లాం ధర్మం మాత్రమే నేటికి అమలులో ఉంది. 39) ఇస్లాం ధర్మం మాత్రమే ప్రస్తుత సమాజానికి అవసరం 40) ఇస్లాం ధర్మం ప్రళయం వరకు చెక్కు చెదరనిది. ఎవరైతే ఈ ధర్మాన్ని తిరస్కరిస్తారో వారే ఇహ, పరాలలో నష్టపోతారు. పేరుకు ముస్లింలమని దీనికి వ్యతిరేకంగా నడుచు చున్న వారిని చూచి ఇస్లాం ధర్మాన్ని నిందించరాదు.

ఇకనైనా ముస్లింలు సువర్ణావకాశాలను చేజార్చుకోకుండా ఇస్లాం వాస్తవ బోధనలు తెలుసుకొని వాటి ప్రకారం ఆచరించి అల్లాహ్‌ను సంతుష్టపర్చి, ఆయన దయకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాం.

ఈ పుస్తకమును ముద్రించ దలచినవారు ఈ క్రింది అడ్రస్‌ను సంప్రదించవలసిందిగా కోరుచున్నాము. ఈ పుస్తకమును చదివి, గ్రహించి, ఆచరించి ఇతరులకు కూడా ఈ పుస్తకాన్ని పంచవలసిందిగా కోరుచున్నాం.

**జమియతే షుబ్బాన్ ఎహ్లే హదీస్**

రిజిష్టర్డ్ నెం. 786/10

ఇ.నెం. 24-63-2సి, అబుసరంగ్ మన్‌జిల్ (కోటవీధి)

ఫ్రెరిరోడ్, విశాఖపట్నం-1. సెల్ నెం. **8019798552**



بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ
JAMIA-IBN-E-HAJAR
Errakunta, Hyderabad-5